ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
3
శనివారం 1 ఫిబ్రవరి 2025

హెలీప్యాడ్ ప్రాంగణ స్థలంలో పోలీసు అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



సీఎం సభకు ఏర్పాట్లు పూర్తి

- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు
- హెలీప్యాడ్, సభా స్థలాలను పరిశీలించిన మంత్రి, కలెక్టర్, ఎస్పీ

సంబేపల్లె, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంబేపల్లెలో పాల్గొనే సభ ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హెలీప్యాడ్, సభ జరిగే స్థలాలను పరిశీలించారు. కాగా రాష్ట్ర ముఖ్యమంత్రి వృద్ధాప్య పించనుదారులైన కొప్పుల మంగమ్మ, వికలత్వ పించన్‌దారుడైన గోళ్ల వెంకటేశ్వర్ల ఇంటికి వెళ్లి పించన్ డబ్బులు అంజేయనున్నారు. కలెక్టర్ ఆదేశాలతో లబ్ధిదారుల గృహాలకు సోలార్ విద్యుత్ కనెక్షన్‌ను ఏర్పాటు చేశారు. వికలాంగుడైన వెంకటేశ్వర్‌కు మూడు సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కలెక్టర్ కేటాయించారు. హెలీప్యాడ్, బారికేడ్లు, అగ్నిమాపక వాహనం ఏర్పాటు, భద్రతా సౌకర్యం, పార్కింగ్, ప్రొటోకాల్, తాగునీటి సౌకర్యం తదితర అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా జనరేటర్ సౌకర్యం కల్పించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు సిద్ధం చేశారు.

సీఎం పర్యటన వివరాలిలా..

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంబేపల్లె కార్యక్రమానికి హాజరయ్యే క్రమంలో భాగంగా శనివారం ఉదయం 11.05 నిమిషాలకు గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 12.05 నిమిషాలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అనంతరం హెలికాఫ్టర్ ద్వారా 12.20 నిమిషాలకు సంబేపల్లె సమీపంలోని పీఎస్‌కాలనీ వద్ద ఉన్న హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన వెళ్లి మధ్యాహ్నం 1 గంటకు సంబేపల్లెలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో పాల్గొంటారు. 1.50 నిమిషాలకు సంత గేటు గుండా పించన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడి వారికి పించన్ అందజేస్తారు. అనంతరం కడప విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి గన్నవరంకు వెళతారు.

మామూళ్ల మద్యం..!

- తెగ తాపిస్తున్నారు..!!
- షాపులే బార్లలా..
- పల్లెపల్లెకూ బెల్టు.. అటు చూస్తే ఒట్టు
- తాట తీలేదు.. బెల్టూ తీలేదు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్




4

రిమాండుకు ఎస్ఐ, సీఐ

4

తెలుగుదేశం అంటే కార్యకర్తల పార్టీ అని పేరు. చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో కార్యకర్తలు వెల్లువలా రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయడమే ఇందుకు నిదర్శనం. అంతటి బలమైన కార్యకర్తలను కలిగి ఉండడం వల్లే.. ఐదేళ్ల వైసీపీ అరాచకాలను తట్టుకుని గత ఏడాది మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించింది. ఆ ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు ప్రాణాలకు తెగించి పోరాడారు. ఒక విధంగా చెప్పాలంటే.. వైసీపీతో యుద్ధమే చేశారు. ఫలితమే అన్నమయ్య జిల్లాలోని ఆరు అసెంబ్లీ స్థానాలలో నాలుగింటిని భారీ మెజార్టీతో కైవసం చేసుకున్నారు. అయితే ఎన్నికలు ముగిసే వరకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తనని రొమ్ము విరుచుకుని తిరిగిన వాళ్లకు.. కూటమి అధికారంలోకి రాగానే.. బొమ్మ మరోలా కనిపిస్తోంది. పార్టీ అధికారంలోకి వస్తే.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని విధాల చితికిపోయిన తమ బతుకులు ఎంతోకొంత మారుతాయని ఆశించిన వాళ్ల ఆశలు అడియాశలుగా మిగిలిపోతున్నాయి. దీంతో ఎన్నికలు ముగిసి.. ప్రభుత్వం ఏర్పాటయ్యేవరకు కార్యకర్తలమైన మేము.. ఇప్పుడు కరివేపాకులం అయిపోయామా అనే భావన వాళ్లలో కనిపిస్తోంది.



- టీడీపీలో ముఖ్యనేతల మధ్య ఆధిపత్యపోరు
- నలిగిపోతున్న ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలు
- పార్టీ సభ్యత్వం లేని వాళ్ల చేతుల్లో పెత్తనం
- కూటమిలోనూ.. లబ్ధిపొందుతున్న వైసీపీ
- నేడు జిల్లాలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు

కరివేపాకులా.. కార్యకర్తలు..!



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ.. టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య గ్రూపు తగాదాలు నడుస్తున్నాయి. ప్రధానంగా తెలుగుదేశం పార్టీలో ముఖ్యనాయకుల మధ్య ఆధిపత్య పోరు వల్ల కార్యకర్తలు ఏ నాయకుని దగ్గరకు వెళ్లాలో తెలియక.. ఎవరి దగ్గరకు వెళ్తే ఎవరి ఆగ్రహానికి గురవుతామో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఐకమత్యంగా ఉండి రాజకీయంగా వైసీపీని దెబ్బకొట్టాల్సిన టీడీపీ ముఖ్య ప్రజాప్రతినిధులు గ్రూపు తగాదాలతో కొట్టుకు చస్తుంటే.. సందట్లో సడేమియా అన్నట్లు.. వైసీపీ నాయకులు లబ్ధిపొందుతున్నారు. కొన్ని చోట్ల సాక్షాత్తూ ఎమ్మెల్యేలే ఎన్నో ఏళ్లుగా తెలుగుదేశం పార్టీ జెండాను మోసిన వాళ్లను కాదని.. వైసీపీ నాయకులను చేరదీసి వాళ్లకు కాంట్రాక్టు పనులు ఇస్తున్నారు. కొన్నిచోట్ల ఏకంగా పెత్తనమే కట్టబెడుతున్నారు. గత ఎన్నిల్లో కూటమి అభ్యర్థుల ఓటమికి కృషిచేసిన వాళ్లకు పెద్ద పీట వేశారనే విమర్శలు ఉన్నాయి. ఇదే సమయంలో టీడీపీ పెద్దలు సైతం నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోందో విచారించకుండా.. గాలికి వదిలేశారనే విమర్శలూ ఉన్నాయి. నేడు పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల దుస్థితిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. నియోజకవర్గాల వారీగా గ్రూపు తగాదాలను పరిశీలిస్తే..

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె నియోజకవర్గంలో ముఖ్యంగా రెండు గ్రూపులు ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే శంకర్, టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి వర్గాలు రెండు గ్రూపులుగా విడిపోయారు. తంబళ్లపల్లెలో కొండ్రెడ్డి, బి.కొత్తకోటలో పర్వీన్‌తాజ్ ఏ గ్రూపులోనూ లేరు. సామాన్య కార్యకర్తలు, తటస్థంగా ఉన్న నాయకులు ఏ నాయకుని దగ్గరకు వెళ్లాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. శంకర్, జయచంద్రారెడ్డి వర్గాల మధ్య ఆధిపత్యపోరు నడుస్తోంది. దీంతో కార్యకర్తలు నలిగిపోతున్నారు. ఇటీవల జరిగిన నారా లోకేశ్ జన్మదిన వేడుకల సందర్భంగా ఇరువర్గాల మధ్య నెలకొన్న వివాదం మరోసారి రచ్చకెక్కింది. శంకర్ వర్గీయులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, కేకులను జయచంద్రారెడ్డి వర్గీయులు చించేసి పడేశారు. ఈ ఘటనకు సంబంధించి ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. అధిష్టానానికి సైతం ఫిర్యాదులు పంపారు. బి.కొత్తకోటలో శంకర్ వర్గీయులపై కేసు నమోదైంది.

రాజంపేటలో..

రాజంపేట టీడీపీలో మూడు గ్రూపులు ఉన్నాయి. టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ఒక గ్రూపు, రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు మరో గ్రూపు, మేడా విజయశేఖర్ రెడ్డి మూడో గ్రూపుగా ఉన్నారు. ఈ గ్రూపుల వల్ల కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ నిజమైన టీడీపీ కార్యకర్తల పనులు కావడం లేదు. నాయకుల వర్గపోరుతో అధికారులు సైతం నలిగిపోతున్నారు. ఈ ముగ్గురి నాయకుల విభేదాల వల్ల వైసీపీ ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కూటమి ప్రభుత్వంలోనూ చక్రం తిప్పుతూ.. ఎమ్మెల్యేగా ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ అధికారాలు చెలాయిస్తున్నారు. దీంతో వైసీపీ వాళ్ల పనులే జరుగుతున్నాయి. రాజంపేటలో వైసీపీ ప్రభుత్వమే ఉన్నట్లు ఉంది. దీంతో టీడీపీ కార్యకర్తలు డీలా పడిపోయారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన పార్టీల్లో విభేదాలు రగులుతున్నాయి. ఇక్కడ ఎమ్మెల్యే జనసేన. ఇతను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అనుచరుడు. ఎన్నికల అనంతరం.. ఆదినుంచి పార్టీలను నమ్ముకున్న టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలను, సీనియర్ నాయకులను పక్కన పెట్టడంతో.. వీరంతా ఆవేదన చెందుతున్నారు. ఈ నియోజకవర్గంలో కూటమి నేతలకంటే.. వైసీపీ నాయకుల పనులే సాఫీగా జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి ఉదాహరణ రైల్వేకోడూరు మండలం వెంకటరెడ్డిపల్లెలో వైసీపీ నాయకునికి కాంట్రాక్టు పని ఇచ్చారు. చిట్వేలి - కోడూరు డబుల్ రోడ్డు పనులు వైసీపీ నాయకుడే చేస్తున్నాడు. ఇక్కడ జనసేన, బీజేపీ, టీడీపీ నాయకుల మధ్య సఖ్యత లేదు. ఎవరికి వారే యుమునా తీరే అన్నట్లుగా ఉన్నారు.

మదనపల్లెలో..

మదనపల్లె నియోజకవర్గంలోని టీడీపీలో రెండువర్గాల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. ఈక్రమంలో ప్రభుత్వ, పార్టీ కార్యక్రమం ఏదైనా పట్టణంలోనే కాదు.. ఆయా మండలాల్లో రెండువర్గాలు నిర్వహిస్తూ ఒకరిపై మరొకరు పైచేయి చూపే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా ఒక వర్గమైతే, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు మరోవర్గంగా ఉంటూ గ్రూపు రాజకీయాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే కొందరిని కలుపుకుని గ్రూపుగా ఉంటూ కార్యక్రమాలు చేస్తుండగా, శ్రీరాం చినబాబు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా, అసంతృప్తితో దూరంగా ఉంటున్న నియోజకర్గ, మండల స్థాయి నేతలను కలుపుకుని కార్యక్రమాలు చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్, రాటకొండ బాబురెడ్డి, జనసేన నేత గంగారపు రామ్‌దాస్‌చౌదరితో సఖ్యతగా ఉంటున్నారు. దీంతో పార్టీలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు, నిజమైన టీడీపీ కార్యకర్తలు తమ పనులకోసం ఏ నాయకుని దగ్గరకు వెళ్లాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. మిగిలిన నియోజకవర్గాలలో కూడా చాప కింద నీరులా గ్రూపు తగాదాలు నడుస్తున్నాయి. ఇప్పటివరకు రచ్చకెక్కలేదు. దీని వల్ల కార్యకర్తలు నలిగిపోతున్నారు. ఇప్పటికైనా టీడీపీ అధిష్టానం జోక్యం చేసుకుని పార్టీ గెలుపుకోసం పనిచేసిన కార్యకర్తలు, ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎస్ఐ, సీఐలు రిమాండ్‌కు


మీడియాతో మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి


రామసముద్రం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): లారీ ప్రమాదం కేసులో సీజ్ చేసిన లారీని విడిపించేందుకు లారీ ఓనర్ నుంచి రూ.70 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన రామసముద్రం ఎస్ఐ వెంకటసుబ్బయ్యను ఇందులో ప్రమేయం ఉన్న సీఐ రమేష్‌లను శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి తెలిపారు. ఇందులో ఏ1గా ఎస్ఐ, ఏ2గా సీఐ ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ కేసుకు సంబంధించి గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ, సీఐలతో పాటు మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడును ఏసీబీ అధికారులు విచారణ చేశామన్నారు. కాగా మదనపల్లెలోని ఎస్ఐ, సీఐ ఇళ్లలోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా మండలంలోని పోలీస్‌స్టేషన్‌లోకి మీడియాతో పాటు ఎవరినీ అనుమతించ కపోవడంతో ఏం జరుగుతోందని ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. పోలీసుల పనితీరుపై ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- క్లస్టర్ కేంద్రంగా విద్యా కార్యక్రమాలు
- డీఈవో సుబ్రమణ్యం, డీవైఈవో శివప్రకాశ్‌రెడ్డి


మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ సుబ్రమణ్యం

సంబేపల్లె, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని, అందుకు ఉపాధ్యాయులు తోడ్పాటును అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, ఉప విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డిలు సూచించారు. శుక్రవారం సంబేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో వారు మాట్లాడారు. సంగ్రహణాత్మక పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా పదవ తరగతి విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజించి వెనుకబడిన వారు కూడా ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. ఎస్సీఈఆర్టీ రూపొందించిన 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. సంబేపల్లెలో శనివారం సీఎం చంద్రబాబు పర్యటన దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం మెనూ తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారి శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మామూళ్ల మద్యం..!

తక్కువ ధరకే నాణ్యమైన మద్యం ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. అయితే మద్యం విక్రయాల్లో షాపు యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నా పట్టించుకోవడం లేదు. పట్టణాలు, పంచాయతీల్లో షాపులకు అనుబంధంగా అనధికార సిట్టింగ్ గదులు, గ్రామాల్లో బెల్టు దుకాణాలు విచ్చలవిడిగా వెలిశాయి. బార్లను తలపించేలా వ్యాపారాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో ఉండడంతో నడిరోడ్డుపై మద్యం తాగుతున్నా అటువైపే చూడడం లేదు. చిల్లర దుకాణాల్లోనూ మందుబాబులు మత్తులో తూగుతున్నారు.

- తెగ తాపిస్తున్నారు..!!
- షాపులే బార్లలా..
- పల్లెపల్లెకూ బెల్టు.. అటు చూస్తే ఒట్టు
- తాట తీలేదు.. బెల్టూ తీలేదు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్


మద్యం షాపునకు అనుబంధంగా నడుస్తున్న అనధికార సిట్టింగ్

మదనపల్లె, జనవరి 31(ఆంధ్రజ్యోతి): 'మద్యం షాపులకు అనుబంధంగా సిట్టింగ్ రూములు పెట్టినా, పల్లెల్లో ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహించినా తాట తీస్తా.. బెల్టు తీస్తా.. అలా ఎవరైనా చేస్తే మొదటి విడతగా కేసు నమోదు చేస్తాం. అదే వ్యక్తి రెండోసారి పట్టుబడితే మద్యం షాపు లైసెన్సు కూడా రద్దు చేస్తా'మని ఎక్సైజ్‌శాఖ మంత్రి నుంచి సీఎం చంద్రబాబునాయుడు వరకూ చెబుతున్న మాటలివీ. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్టోబరు 15న కొత్తమద్యం పాలసీతో దుకాణాలు అమలులోకి వచ్చాయి. కానీ పట్టణమే కాదు.. పల్లెల్లోనూ మద్యం పాలసీగానీ, సీఎం ఆదేశాలు కానీ ఎక్కడా అమలు కాలేదు. పట్టణాలు, పంచాయతీల్లో షాపులకు అనుబంధంగా అనధికార సిట్టింగ్ గదులు, గ్రామాల్లో బెల్టు దుకాణాలు విచ్చలవిడిగా వెలిశాయి. ఓ విధంగా చెప్పాలంటే.. పట్టణాల్లో షాపులే బార్లు లాగా మార్చి తెగతాపిస్తుండగా, షాపునకు అనుబంధంగా ఉన్న పల్లెలకూ మద్యం సరఫరా చేస్తున్నారు. పట్టణాల్లో మాత్రం ఎంఆర్‌పీ ధరలకే విక్రయిస్తుండగా, బెల్టు షాపుల్లో మాత్రం క్వార్టర్ బాటిల్‌పై రూ.20 అదనంగా వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. పట్టణంలో ఒక్కోషాపు 400 చ.అ. విస్తీర్ణంలో ఉంటే, దానికి అనుబంధంగా అంతకు పదింతులు, వందరెట్ల విస్తీర్ణంలో సిట్టింగ్ గదులు, హాలులు ఏర్పాటు చేశారు. కొందరైతే గోదాము తరహాలో పైన రేకులు, కూర్చోడానికి బల్లలు, నిర్మాణ దిమ్మెలు ఏర్పాటు చేశారు. దీంతో మందుబాబులు అక్కడే తాగి, అక్కడే తూగుతూ నిద్రపోవడానికి కావాల్సిన వాతావరణాన్ని కల్పించారు.

జిల్లాలో పెద్ద పట్టణంగా పేరున్న మదనపల్లె మున్సిపాలిటీలో మద్యం దుకాణాలు బార్లను తలపిస్తున్నాయి. షాపులకు అనుబంధంగా సిట్టింగ్ రూములు ఏర్పాటు చేసి తెగ తాపిస్తున్నారు. పట్టణంలో పది దుకాణాలు, తిరుపతిరోడ్డు, బెంగళూరురోడ్డు, పుంగనూరురోడ్డుతో పాటు సీటీఎంతో కలిపి మొత్తం 14 మద్యం షాపులు ఉన్నాయి. వీటిలో మూడు, నాలుగు షాపులు మినహా అన్నింటిలోనూ సిట్టింగ్ సౌకర్యం కల్పించి తాపిస్తున్నారు. అలాగే మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మొత్తం 22 దుకాణాలు ఉండగా, అందులో మిగిలిన రామసముద్రం, నిమ్మనపల్లె మండలాల్లో ఒక్కొక్కటి, కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లో మూడు చొప్పున మొత్తం ఎనిమిది దుకాణాలు ఉన్నాయి. వీటిలోనూ మదనపల్లె తరహా పరిస్థితులే కనిపిస్తున్నాయి.

సిట్టింగ్ రూములపై చర్యలు

- బీమలింగ, ఎక్సైజ్ సీఐ, మదనపల్లె

మద్యం షాపునకు అనుబంధంగా ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. అలా ఎవరైనా, ఎక్కడైనా అనధికారికంగా నిర్వహిస్తుంటే చట్టవిరుద్ధం. అది నేరం కూడా. అలాంటి వాటిపై చర్యలు తీసుకుంటాం. తాము ఏ దుకాణదారుని నుంచీ డబ్బులు తీసుకోలేదు.

ఇక్కడ ప్రతిచోటా షాపులు, సిట్టింగ్ రూముల వద్ద మద్యం ప్రియులకు చికెన్, చేప, గోడిగుడ్డు, ఇతర ఐటమ్స్ కూడా అక్కడే అందుబాటులో ఉంచారు. కొందరు అక్కడే బహిరంగంగా తాగేసి వెళ్లిపోతున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన ఎక్సైజ్, సివిల్ పోలీసులు దుకాణాల నుంచి నెలవారి మామూళ్లు ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నారు. మదనపల్లెలో ఒక్కో దుకాణం నుంచి ఏరియాను బట్టి నెలకు రూ.40 వేల నుంచి 50 వేలు వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే మదనపల్లె ఎక్సైజ్ పరిధిలోని అంగళ్లు, బి.కొత్తకోటతో పాటు ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ములకలచెరువులో రూ.30వేలు, మిగిలిన మండలాల్లో వ్యాపారాన్ని బట్టి రూ.15వేల నుంచి రూ.20వేలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ మొత్తాన్ని ఎక్సైజ్, సివిల్ పోలీసుల పేరుతో వసూలు చేస్తున్నట్లు దుకాణదారులే బహిరంగంగా చెబుతున్నారు. అయితే ఈ విధానాన్ని ఇద్దరు లేదా ముగ్గురు షాపుల యజమానులు తిరస్కరించిన్నట్లు తెలిసింది. ఇదిలా వుండగా, పట్టణంలోని నీరుగట్టువారిపల్లె, తదితర శివారు ప్రాంతాల్లోని చిన్నచిన్న హోటళ్లతో పాటు జాతీయ రహదారుల వెంట ఉన్న కొన్ని డాబాల్లోనూ మద్యం తాగడానికి అనుమతిస్తున్నారు. మద్యం లేనిదే వ్యాపారం ఉండదన్నట్లుగా నిర్వాహకులు భావిస్తున్నారు.

మదనపల్లె, ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని మదనపల్లె, రామసముద్రం, నిమ్మనపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, పెద్దమండ్యం మండలాల పరిధిలో మొత్తం 32 దుకాణాలు ఉన్నాయి. అయితే అన్ని గ్రామాల్లో బెల్టు దుకాణాల్లో సంపూర్ణంగా మద్యం దొరుకుతోంది. ఆయా షాపు పరిధిలోకి వచ్చే గ్రామాలకు కొన్ని చోట్ల ప్రత్యేకంగా మనిషిని ఏర్పాటు చేసి సరఫరా చేస్తుండగా, కొన్నిచోట్ల మాత్రం బెల్టు నిర్వాహకులే షాపు వద్దకు వచ్చి తమకు కావాల్సిన బ్రాండ్లను తీసుకెళ్తున్నారు. కొన్ని గ్రామాల్లో చిల్లర దుకాణంలో నిర్వహిస్తుండగా, మరికొన్ని గ్రామాల్లో నాటుసారా విక్రయించే వారు ఇంట్లో పెట్టుకుని మందు ప్రియులకు రహస్యంగా చేరుస్తున్నారు. పట్టణాల్లో షాపునకు అనుబంధంగా, అక్కడ అవకాశం లేకుంటే కొంతదూరంలోనో, ఎదురుగానో రూములు, స్థలాలు తీసుకుని అదనపు ఖర్చు చేసి షెడ్లు నిర్మించారు. పల్లెలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఇదిలావుండగా మద్యం దుకాణాలకు అనుబంధంగా అనధికార సిట్టింగ్‌లతో బార్ల యజమానులు తీవ్రంగా నష్టపోతున్నట్లు చెబుతున్నారు. వీటిపై చర్యలు తీసుకోకుంటే బార్‌లను మూసేయడమే మేలని, ఫలితంగా బార్ నిర్వహణకు అయ్యే ఖర్చులైనా మిగులుతాయని వారు భావిస్తున్నట్లు వాపోతున్నారు.


రోడ్డుపై తాగుతున్న మద్యం ప్రియులు


సిట్టింగ్ హాలులో మద్యం ప్రియులు


చిల్లర దుకాణానికి అనుబంధంగా నడుస్తున్న బెల్టుషాపు

భూతగాదాలతో రైతు ఆత్మహత్య...!

- జాతీయ రహదారిపై కుటుంబ సభ్యుల ధర్నా


మార్కెట్‌యార్డు వద్ద మృతదేహంతో ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు



మృతుడు రామకృష్ణారెడ్డి (ఫైల్‌ఫొటో)

గుర్రంకొండ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భూతగాదాలతో ఓ రైతు ఆత్మహత్య చేసుకొన్న సంఘటన తలారివాండ్లపల్లె వద్ద శుక్రవారం ఉదయం చోటు చేసుకొంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని గుర్రంకొండ పంచాయతీ తలారివాండ్లపల్లెకు చెందిన రేగంటి రామకృష్ణారెడ్డి(50)కి అదే గ్రామానికి చెందిన సి.రమణారెడ్డి కుటుంబానికి కొన్నేళ్లుగా భూతగాదాలున్నాయి. ఈ క్రమంలో పదిహేను రోజుల క్రితం భూముల విషయమై గొడవపడి కేసులు పెట్టుకున్నారు. రామకృష్ణారెడ్డి(50)ను చంపుతానంటూ పలుమార్లు రమణారెడ్డి బెదిరించినట్లు మృతుడి భార్య అమృత తెలిపిందన్నారు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన రామకృష్ణారెడ్డి గురువారం రాత్రి పొలం వద్దకు వెళ్లి ఉరివేసుకొని మృతి చెందాడు. కాగా పొలం వద్దకు వెళ్లిన భర్త ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో ఉదయం పొలం వద్ద కుటుంబ సభ్యులు చూడగా ఉరేసుకొని వేలాడుతున్నట్లు తెలిపారు. విషయాన్ని పోలీసు లకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఇదిలా ఉండగా భూతగాదాలతో తన భర్త చనిపోయేందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ భార్య కుటుంబ సభ్యులతో కలిసి గుర్రంకొండ-బెంగళూరు జాతీయ రహదారిపై మార్కెట్ యార్డు వద్ద ధర్నా చేశారు. తప్పుడు రెవెన్యూ రికార్డులను సృష్టించి గ్రామస్థులను ఇబ్బంది పెడుతున్న రమణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఐ మధురామచంద్రుడు బాధితులకు సర్దిచెప్పడంతో ధర్నా విరమించారు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా.. తలారివాండ్లపల్లెలో రమణారెడ్డి కుటుంబానికి, రేగంటి రెడ్డెప్ప కుమారులకు భూ సమస్యలున్నాయి. ఈ భూముల సమస్యలపై ఇరువర్గాల వారు కోర్టును ఆశ్రయించారు. కేసులు నడుస్తున్నాయి. రెవెన్యూ రికార్డులను పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

నీరు-చెట్టు పెండింగ్ బిల్లులు రూ.18.70 కోట్లు

మదనపల్లె, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్‌లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన నీరు-చెట్టు పనుల బిల్లులు రూ.18.70 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. డివిజన్‌లోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో 2014 నుంచి 2019 వరకూ చేపట్టిన పనుల్లో 265 పనులకు సంబంధించి రూ.18.70 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. భూగర్భజలాలను వృద్ధి చేసే క్రమంలో అప్పటి, ఇప్పటి సీఎం చంద్రబాబు నీరు-చెట్టు పనులు చేపట్టారు. మొదట్లో చేపట్టిన పనులకు బిల్లులు మంజూరు కాగా, ఎన్నికల ముందు 2018-19లో చేపట్టిన పనుల బిల్లుల చెల్లింపునకు బ్రేక్ పడింది. తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో నీరు-చెట్టు పనులను నిలిపేశారు. ఈ నేపథ్యంలో చాలామంది కోర్టును ఆశ్రయించినా.. కొందరికి మినహా అందరికీ చెల్లించలేదు. తిరిగి 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆశలు రేకెత్తాయి.

కల నెరవేరేనా..!


పుష్కలంగా నీరు ఉన్న వెలిగల్లు ప్రాజెక్టు

దేశానికి రైతే వెన్నెముక. రైతన్నలు పండించే పంటలతోనే దేశం సుభిక్షంగా ఉంటుంది. కానీ గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. వ్యవసాయానికి కావాల్సిన నీరు అందించడంలో విఫలమైంది. చేసేదేమీ లేక.. వ్యవసాయంపై మక్కువ చంపుకోలేక.. రైతులే లక్షలు వెచ్చించి బోరుబావులు వేసినా నీటిజాడే కనిపించడం లేదు. వెయ్యి అడుగులు వేసినా నీటిచుక్క లేదని రైతులు లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా 25 వేల ఎకరాల సాగు భూమి ఉంది. కూటమి ప్రభుత్వంలోనైనా వెలిగల్లు ద్వారా నీటిని అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

- వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపం
- వెయ్యి అడుగులు వేసినా జాడలేని నీటి చుక్క
- ఎడారిని తలపిస్తున్న వేలాది ఎకరాల వ్యవసాయ భూములు
- నీళ్లు లేక ఎండిపోతున్న మామిడి తోటలు
- 'కూటమి'లోనైనా వెలిగల్లు ఎత్తిపోతల పథకానికి మోక్షం లభించేనా ?

గాలివీడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గత 5 సంవత్సరాల వైసీపీ ప్రభుత్వంలో మండల ప్రజలకు తాగు, సాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమైంది. వెలిగల్లు ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ వీటిని చెరువులకు, కుంటలకు, భూములకు నీరు అందించలేని దుస్థితిలో అప్పటి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కరువు కాటకాలకు నిలయమైన ఈ ప్రాంతం వెలిగల్లు ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా అన్ని గ్రామాలకు తాగు, సాగునీరు అందించాలని రైతులు అప్పటి ప్రజాప్రతినిధుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా వారు పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెలిగల్లు ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం ద్వారా కనీసం చెరువులకు నీరు నింపి ఉంటే ఈ రోజు వ్యవసాయంతో పాటు మామిడి తోటలను కూడా కాపాడుకొనేవారమని రైతులు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చేసిన నిర్లక్ష్యం వలన మండల రైతాంగానికి శాపంగా మారింది. మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 25 వేల ఎకరాల సాగు భూమి కలదు. అన్ని పంచాయతీల్లో 200 వరకు చెరువులు, కుంటలు ఉన్నాయి. వెలిగల్లు, కుషావతి ప్రాజెక్టుల ద్వారా 6 పంచాయతీల్లో 7 వేల ఎకరాల వరకు సాగు భూమి, మిగిలిన 18 వేల ఎకరాల వ్యవసాయ భూములు వర్షాధారంపై ఆధారపడి సాగు చేస్తున్నారు. వీటితో పాటు మరో 2 వేల ఎకరాలకు పైగా మామిడి, జామ, సపోట, అరటి, నిమ్మ వంటి పండ్ల తోటలను సాగు చేస్తున్నారు.


చుక్కనీరు లేక బోసిపోయిన మొరగలచెరువు

కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు

మండల కేంద్రానికి కూతవేటు దూరంలో పాపాఘ్ని నదిపై 4.64 టీఎంసీల నీటి సామర్థ్యంతో వెలిగల్లు ప్రాజెక్టును నిర్మించారు. ఈ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా 24 వేల ఎకరాలకు (మూడు మండలాల పరిధిలో) సాగునీరు, రాయచోటి పట్టణానికి తాగునీరు అందిస్తున్నారు. అయితే ప్రాజెక్టు ఉన్న మండలమైన గాలివీడులో మాత్రం రైతాంగానికి, ప్రజలకు సాగు, తాగునీరు అందడం లేదు. మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు గానూ గరుగుపల్లి, పందికుంట, తూముకుంట, కొర్లకుంట పంచాయతీల్లో మాత్రమే పూర్తి స్థాయిలో భూములకు సాగునీరు అందుతుండగా గుండ్లచెరువు, పేరంపల్లి, బోరెడ్డిగారిపల్లె పంచాయతీల్లో 4 వంతుల వ్యవసాయ భూముల్లో ఒక వంతు వ్యవసాయ భూములకు నీరు సౌకర్యం అందుతోంది. మిగిలిన 10 పంచాయతీల్లోనూ వ్యవసాయ భూములకు ఒక చుక్క నీరు కూడా అందలేదు. అయితే ఈ గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూములకు వెలిగల్లు ఎత్తిపోతల పథకం ద్వారా నీటి సౌకర్యం కల్పించలేదు. ముఖ్యంగా చీమలచెరువుపల్లె రెండు వేల ఎకరాలు, నూలివీడు మూడు వేల ఎకరాలు, గోపనపల్లె రెండు వేల ఎకరాలు, ఎగువగొట్టివీడు రెండు వేల ఎకరాలు, గుండ్లచెరువు 1500 ఎకరాలు, గోరాన్‌చెరువు మూడు వేల ఎకరాలు మొత్తం 13,500 ఎకరాలు మెట్ట, మాగాని భూములు కలవు. ఈ గ్రామాల కింద దాదాపుగా 60 వరకు కుంటలు, చెరువులు కలవు. అయితే ఈ గ్రామాల్లో 2 వేల ఎకరాలకు పైగా మామిడి తోటలు ఉన్నాయి. నీటి సౌకర్యం లేకపోవడం వలన వ్యవసాయ భూములన్నీ ఎడారిని తలపిస్తున్నాయి. అయితే మామిడి తోటలను కాపాడుకునేందుకు అప్పులు చేసి ఒక్కో రైతు 5 నుంచి 15 బోర్లు వెయ్యి అడుగుల లోతు వరకు వేసినా నీటి జాడ లేదు. దీంతో రైతులు చేసిన అప్పులు తీర్చుకోలేక కొంత మంది భూములను అమ్ముకుంటుండగా, మరి కొందరు జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారు.


ఎండిపోయిన మామిడితోట

2014లో టీడీపీ ప్రభుత్వ కాలంలో వెలిగల్లు ప్రాజెక్టు నుంచి నీటి సౌకర్యానికి వ్యవసాయ భూము లకు నీటిని అందించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ముఖ్యంగా వెలిగల్లు ప్రాజెక్టు కుడికాలువ ద్వారా గుండ్లచెరువు పంచాయతీలోని గండిచెరువుకు నీటిని తరలించి అక్కడి నుంచి లిఫ్ట్ ద్వారా కమలా మర్రిలోని పడమటపల్లెకు సమీపంలో ట్యాంక్‌ను ఏర్పాటు చేసి తద్వారా కాలువల ద్వారా వివిధ గ్రామాల్లోని చెరువులకు సాగునీటిని అందించేందుకు పథక రచన చేశారు. కానీ 2019లో ప్రభుత్వం మారిపోవడంతో ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వెలిగల్లు ఎత్తిపోతల పథకాన్ని అటకెక్కించింది. ఈ పథకం గురించి 5 ఏళ్ల కాలంలో ప్రజాప్రతినిధులకు వందసార్లు రైతులు విన్నవించుకున్నప్పటికీ వారు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పుడు నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వమైనా వెలిగల్లు ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించాలి

- వేణుగోపాల్‌రెడ్డి, కుమ్మరపల్లి, నూలివీడు



నాకు 30 ఎకరాల్లో మామిడి తోట, 10 ఎకరాలు మెట్ట, మాగాని భూములు కలవు. ఈ మామిడి తోటలను కాపాడుకునేందుకు వెయ్యి అడుగుల లోతుతో 15 వ్యవసాయ బోర్లు వేశాను. ఒక్కో బోరుకు సుమారు రూ.2 లక్షలు ఖర్చు చేశాను. వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో మొత్తం 15 బోర్లకు గానూ కేవలం రెండు బోర్లల్లో మాత్రమే నీళ్లు వస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం వెలిగల్లు ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం ద్వారా కనీసం చెరువులకు నీటిని అందిస్తే మామిడి చెట్లను కాపాడుకోవచ్చు.

ఆత్మస్థైర్యం నింపేందుకు...

- ప్రభుత్వ పాఠశాలల్లో ఆత్మరక్షణ కార్యక్రమం
- 422 పాఠశాలలో 33,712 మందికి శిక్షణ
- ఫిబ్రవరి 1 నుంచి మార్చి 15 వరకు..





కడప ఎడ్యుకేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బాలికల్లో ఆత్మస్థైర్యం పెంచేందుకు సర్కారు పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కరాటేతో పాటు మరికొన్ని సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణను నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమాన్ని చేపడుతోంది. అమ్మాయిలపై దాడుల, అత్యాచారాలు ఎదుర్కోనేందుకు బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ కోసం పాఠశాలస్థాయి నుంచే ఉచితంగా కరాటే, జూడో వంటి శిక్షణలు ఇవ్వనున్నారు.

రాష్ట్రంలో చదువుతున్న ఆడపిల్లలు సంరక్షణ కోసం ఆత్మరక్షణ కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో అమలు చేసేం దుకు రాష్ట్ర విద్యాశాఖ శ్రీకార చుట్టింది. ఇందులో భాగంగా వైఎస్సార్ జిలల్లాలో 422 పాఠశాలల్లోని 33712 మంది బాలికలకు ఆత్మరక్షణ శిక్షణ చేపట్టనున్నారు. ఫిబ్రవరి 1 నుంచి మార్చి 15 వరకు 20 సెక్షన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది. ప్రతిరోజు 60 నిమిషాలు ఉంటుంది. ఇందుకు సంబంధించి యాక్షన్ ప్లాన్ కూడా విడుదలైంది. బాలికల ఆత్మరక్షణకు సంబంధించి తైక్వాండో, ఉషు, కరాటే, జూడో, వెస్ట్రన్ బాక్సింగ్, కిక్ బాక్సింగ్, రెజ్లింగ్, క్రావ్ మాగా, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ), ఐకిడో, జీత్ కునే దో, ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ (కలరిపయట్టు వంటివి)లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఆత్మరక్షణ కార్యక్రమం ద్వారా బోధించే కరాటే శిక్షణ బయటి శత్రువులతో పోరాడడమే కాకుండా అంతరంగిక శత్రువులైన కోపం, చిరాకు, జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఆత్మవిశ్వాసంతో తేలికగా పరిష్కరించడం లో సహాయపడుతుంది.

ఆత్మరక్షణ తరగతులు ఎందుకంటే...

ఆత్మరక్షణ తరగతులు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని మరియు స్వీయ క్రమశిక్షణను పెంపొందించడానికి.. వారి శారీరక స్థితిని మెరుగుపరచడానికి సహాయపడతాయి. ప్రత్యేకించి తరగతులు ముగిసిన తర్వాత రాత్రిపూట ఒంటరిగా నడుస్తున్నప్పుడు విద్యార్థులకు ఇది సహాయపడుతుంది. స్వీయరక్షణ ప్రాథమికాలను నేర్చుకోవడం ద్వారా ప్రమాదకరమైన మరియు ఊహించలేని పరిస్థితులకు తమను తాము సిద్ధం చేసుకోవడంలో సహాయపడుతుంది. ఇది విద్యార్థులకు ఆత్మగౌరవం గురించి బోధిస్తుంది. స్వీయ రక్షణ తరగతులు ఆత్మగౌరవం, భయాన్ని అధిగమించడం, అవగాహన/హెచ్చరిక మరియు స్వీయ గౌరవం వంటి అనేక మానవ సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో సహాయపడతాయి. ఆత్మరక్షణ తరగతులు తీసుకోవడం విద్యార్థులకు ఒక విధమైన యోధుల స్ఫూర్తిని పెంపొందించడానికి సహాయపడుతుంది.

శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు...

పాఠశాలల్లో ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడానికి జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన ఏజెన్సీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేయాలని రాష్ట్రంలోని జిల్లా విద్యా అధికారులు, ఎక్స్ అఫిషియో ప్రాజెక్టు కోఆర్డినేటర్లు, సమగ్ర శిక్ష అదనపుప్రాజెక్టు కోఆర్డినేటర్‌లకు సూచించింది. ఈ మేరకు శిక్షకులు తప్పనిసరిగా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ మార్షల్ ఆర్ట్స్‌లో అర్హత మరియు అనుభవం కలిగి ఉండాలి. జిల్లా స్థాయిలో వీరిని కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఎంపిక చేస్తుంది. శిక్షణ పారితోషికం రూ.10వేలు చెల్లిస్తారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎంపీపీయూపీలు, జడ్పీహెచ్ఎస్, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, మున్సిపల్, సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమంలో నైపుణ్యం కలిగిన సమర్థ ఏజెన్సీలను ఆకర్షించడానికి విస్తృత ప్రచారం ఈ సందర్భంగా చేయాల్సి ఉంటుంది.

స్త్రీలనే శిక్షకులుగా నియమించాలి



బాలికలు స్వేచ్ఛగా తిరిగేందుకు ప్రభుత్వం కల్పించిన శిక్షణ పట్ల హర్షనీయం. అయితే బాలికలకు ఇచ్చే ఆత్మరక్షణ శిక్షకులుగా మహిళలను నియమించాలి. ప్రతిరోజు ఉదయం నాలుగవ పీరియడ్‌ను శిక్షణకు కేటాయించాలి. కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రత్యేక దుస్తులను ప్రభుత్వం సరఫరా చేయాలి.

-సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజం



ఆజాద్‌నగర్‌లో ప్రజలకు ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు, వైద్య సిబ్బంది

సికెదిన్నె, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యాధులు రాకుండా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పాటుపడాలని జిల్లా వైద్యాధికారి నాగరాజు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం ఆజాద్‌నగర్‌లోని చౌడేశ్వరీనగర్‌లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీటితొట్లు, పూలకుండీలు, కూలర్లు, తాగి పడేసే కొబ్బరి బోండాలలో నీరు నిలువ ఉన్నట్లయితే దోమల లార్వాలు పెరిగి దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దీంతో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వస్తాయన్నారు. ఇళ్లలో నీరు నిలువ ఉంచుకునే పాత్రలను వారానికి ఒకసారి శుభ్రపరచి వెంటనే ఆరబెట్టాలన్నారు. దీని ద్వారా దోమల లార్వా పెరుగకుండా వాటి ఉత్పత్తిని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాఘవేంద్ర, సీహెచ్‌వో సుకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించి క్యాన్సర్‌ను దూరం చేద్దాం



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సూత్రాలు పాటించి అప్రమత్తంగా ఉంటే క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలను నివారించవచ్చని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం వరల్డ్ సర్వైకల్ క్యాన్సర్ అవగాహన మాసం సందర్భంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై యోగివేమన యూనివర్సిటీ మహిళల వసతి గృహం విద్యార్థినులకు ఎన్ఎస్ఎస్ పీఓ ఆచార్య అనిత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థుల ప్రయోజనార్థం వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పుత్తా పద్మ ఆరోగ్య సూత్రాలు తెలిపారు. ప్రముఖ స్త్రీవ్యాధి నిపుణులు డాక్టర్ వై.ప్రమోదరెడ్డి మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వచ్చే అవకాశాలను, ముందుగా గుర్తించే విధానాలను, చికిత్స పద్ధతులను విశదీకరించారు. అలాగే సర్వైకల్ క్యాన్సర్ రాకుండా నివారించడానికి ఉన్న వ్యాక్సిన్ (హెచ్‌పీవీ) గురించి, ఎన్ని దశలలో వేయించుకోవాలో వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ వెంకటరామిరెడ్డి, ఆచార్య చంద్రమతి శంకర్, ఆచార్య మెర్సీ విజేత విద్యార్థులు పాల్గొన్నారు.

సోషల్ కౌన్సిలర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎన్టీఆర్ సర్కిల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గృహహింస విభాగంలో కడపలో ఖాళీగా ఉన్న సోషల్ కౌన్సిలర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌టీటీపీఎస్://కడప.ఏపీ.జీఓవి.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా అర్హతలు, పోస్టుకు సంబంధించిన వివరాలు పొందవచ్చని సూచించారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 1 నుంచి 15వ తేదీలోపు కార్యాలయ పనిదినాలలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికార అధికారి, డి బ్లాక్ కొత్త కలెక్టరేట్ కడప, వైఎస్సార్ జిల్లా అనే చిరునామాలో సమర్పించాలని సూచించారు. అన్ని ధ్రువీకరణ పత్రాలతో సమగ్రంగా ఉన్న దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామన్నారు.

ఉన్న స్థితి నుంచి ఉన్నతస్థితికి చేరే మార్గం నైపుణ్యం

- ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ వర్లు



మాట్లాడుతున్న ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ వర్లు

కడప ఎడ్యుకేషన్, నవరి 31 (ఆంధ్రజ్యోతి): మనిషి మెదడుకు పది వేల కోట్ల కంప్యూటర్ శక్తి ఉంది.. మీలో నిగూఢంగా ఉన్న శక్తిని తెలుసుకోండి.. విశ్వసించండి.. మీరేం కావాలనుకుంటున్నారో నిర్ణయించుకొని జ్ఞాన దీపాన్ని వెలిగించండి.. మీ జీవితాలతో పాటు సమాజంలోని వారికి వెలుగునివ్వండి అని హైదరాబాద్ వర్లూస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సక్సెస్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ వర్లు అన్నారు. శుక్రవారం వైవీయూ ఏపీజే అబ్దుల్ కలాం ప్రాంగణంలో మానసిక వికాస ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వర్లు మాట్లాడుతూ జ్ఞానాన్ని ఉపయోగించుకున్న వారే గొప్పవారుగా నిలుస్తారన్నారు. సమాజం గుర్తించి అభిమానించి గౌరవించాలంటే మన చేతుల్లోనే ఉందన్నారు. కాలయాపన లేకుండా కార్యోన్ముఖులు కావాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలన్నారు. ప్రశ్న లేకపోతే ప్రగతి ఉండదన్నారు. యువతలో ఎక్కువ భాగం తాము ఏమీ కావాలనుకుంటున్నారో తెలియదని.. అందరూ చదువుతున్నారు కదా అని చదువుతారని.. దీని వల్ల నిర్ణీత వయసు వచ్చాక స్థిరపడలేకపోతారన్నారు. చిన్న వయసులో ఒక బలమైన నిర్ణయం తీసుకొని అమలు చేసేందుకు ప్రయత్నించాలన్నారు. విద్య ద్వారానే గొప్పవారవుతామని సత్యనాదెళ్ల, అబ్దుల్ కలాం జీవిత విశేషాలను వివరించారు. మనతో పాటు ఉన్న వారి కంటే మనం రెండు గంటలు అదనంగా ప్రయత్నిస్తే చేస్తున్న పనిలో ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. సెల్‌ఫోన్‌లలో ఫేస్‌బుక్, ఇన్‌స్టా, యూట్యూబ్ వంటివి కాలహరణ చేస్తాయని, ప్రేమలు సినిమాల్లోనే సక్సెస్ అవుతాయని నిజజీవితంలో కాదన్నారు. ఈ ప్రకృతి అందరికి ఒకే మెదడు ఇచ్చిందని దాని శక్తి తెలియక మనం ఉన్నస్థితిలోనే ఉండిపోతున్నామని.. మైండ్ ను వినియోగించుకున్నవారే ఉన్నత స్థితికి చేరుతారన్నారు. ఆత్మవిశ్వాసం పెంపొందించుకునేందుకు సూచనలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు శాశ్వత ప్రయోజనాలు, ఉజ్వల భవిష్యత్తు గురించి ఆలోచించాలన్నారు. ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ పద్మ, దంత వైద్య నిపుణులు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో సహ అచార్యులు డాక్టర్ అనూ ప్రసన్న, జర్నలిజంశాఖ అధ్యాపకులు డాక్టర్ టి.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా... వ్యక్తి మృతి

దువ్వూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కానగూడూరు సమీపంలోని లింకురోడ్డు వద్ద గురువారం రాత్రి ఆటో బోల్తా పడిన సంఘటనలో వేల్పుల సుబ్బరాయుడు (28) అనే వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించిన వారి బంధువులకు సమాచారం అందించారు. పోలీసులకు విషయం తెలియడంతో సంఘ టనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. తాలుకా సీఐ కళా వెంకటరమణ వివరాల మేరకు.. మదనపల్లె మండలం రెడ్డివారిపల్లె సమీపంలోని గుండావారిపల్లె వద్ద నాలుగు లైన్ల జాతీయ రహదారి బ్రిడ్జి కింద ఐచర్ వాహనం బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కురబలకోట మండలం నడింపల్లెకు చెందిన కార్తీక్(23) అక్కడికక్కడే మృతి చెందగా సీటీఎం రెగంటివారిపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం(40) తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని 108 వాహనంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సమాచారం అందుకున్న సీఐ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

'దళిత ఎంపీడీవోపై కక్ష సాధింపు తగదు'

గాలివీడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దళిత ఎంపీడీవోపై దాడి చేయడమే కాకుండా మండల పరిషత్ సమావేశంలో నిందలు వేయడం సమంజసం కాదని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మందపాటి రవీంద్ర బాబు, సర్పంచ్ పార్థసారథిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరాజులు విమర్శించారు. శుక్రవారం గాలివీడులో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ ఎంపీటీసీ సభ్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత డిసెం బర్ 27న విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవోపై వైసీపీ నాయకులు దాడి చేశా రన్నారు. దీంతో పలువురు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు, నాయకులపై కేసులు నమోదైన విషయం తెలిసిందేనన్నారు. ప్రస్తుతం ఉన్న ఎంపీ టీసీ సభ్యులను ప్రజలు ఎన్నుకోలేదని, అప్పట్లో టీడీపీ నాయకులపై కేసులు, బిల్లుల చెల్లింపులపై బెదిరింపులతో అప్రజాస్వామికంగా ఎంపిక అయ్యారని తెలిపారు. నిజంగా వారికి నైతిక విలువలు ఉంటే వెంటనే తమ పదవులకు రాజీనామా చేసి తిరిగి పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. ఎంపీడీవోపై దాడి చేసిన వారికి సాక్షాత్తూ మండల పరిషత్ అధ్యక్షురాలు వత్తాసు పలకడం, మండల సమావేశంలో నిందితులు కోర్టు పరిధిలోని అంశాలు చర్చించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరు

- ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాకర్ల వెంకట్రామిరెడ్డి

కడప మారుతీనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై రాజీ లేని పోరు సాగిస్తామని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగుల బకాయిలు సుమారు 25వేల కోట్లు ఉంటే కూటమి ప్రభుత్వం కేవలం 13 కోట్లు తూతూ మంత్రంగా విడుదల చేయడం సరి కాదన్నారు. కొండంత బకాయిలు ఉన్నప్పటికీ గోరంత విడుదల చేస్తూ అసత్య ప్రచారం చేసుకోవడం విచాకరమన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల సమస్యల గురించి ప్రతి మూడు నాలుగు నెలలకు ఒకసారి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసేవారన్నారు. ప్రస్తుతం ఆ విధానానికి స్వస్తి పలికి ఉద్యోగుల న్యాయమైన సమస్యలను కూడా పక్కన పెట్టేశారని ఆరోపించారు. టీడీపీ అ ధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా ఇంత వరకు ఉద్యోగుల సమస్యల గురించి ఏ మాత్రం పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులకు రావాలసిన ఐఆర్, పీఆర్సీ ఊసే ఎత్తడం లేదన్నారు. ముఖ్యంగా సచివాలయ వ్యవస్థను హేతుబద్ధం చేస్తున్నామనే సాకుతో ఉద్యోగుల సంఖ్యను కుదించి పనిభారం పెంచడం విచారకరమన్నారు. ఇప్పటికైనా సచివాలయ వ్యవస్థను గురించి ఒక కమిటీ వేసి తద్వారా హేతుబద్ధీకరణ చేయాలన్నారు. లేనిపక్షంలో ఉద్యోగుల ను ఏకం చేసి పాలక ప్రభుత్వంపై పోరు చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు లెక్కల జమాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో క్యాంటీన్లు ఏర్పాటు

వేంపల్లె, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు నాలుగు నెలల తర్వాత ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో క్యాంటీన్లు అందుబాటులోకి వచ్చాయి. గతంలో ఉన్న క్యాంటీన్లను మూసేశారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ద్వారా అధికారులు డ్వాక్రా గ్రూపులకు కేటాయించారు. తమకే కావాలని టీడీపీలో ఉన్న ప్రధాన నాయకులు పట్టు బట్టడం, నిబంధనల ప్రకారం కేటాయించాలని, లేకుంటే తమ వారికి ఒకటి ఇవ్వాలని వైసీపీ ముఖ్యనేత పట్టుబట్టడంతో ట్రిపుల్ ఐటీ అధికారులకు తలనొప్పిగా మారింది. దీంతో క్యాంటీన్ల వ్యవహారాన్ని కలెక్టర్‌కు పంపారు. దీంతో నాలుగు నెలలు జాప్యం కాగా ట్రిపుల్‌ఐటీలో ఉన్న వేలాది మంది విద్యార్థులు బయటి ఫుడ్ కోసం ఎగబడ్డారు. క్యాంటీన్లు లేక ఇబ్బంది పడ్డారు. శుక్రవారం బాలుర హాస్టల్‌లో ఒక క్యాంటీన్, బాలికల హాస్టల్‌లో మరో క్యాంటీన్‌ను ప్రారంభించారు. దీనితో క్యాంటీన్లు రద్దీగా కనిపించాయి.

క్రమశిక్షణతో విధులు నిర్వహించండి : అదనపు ఎస్పీ



పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ

కడప క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ జిల్లా పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని అదనపు ఎస్పీ కె.ప్రకాశ్‌బాబు పిలుపునిచ్చారు. జిల్లా సాయుధ పోలీసు బలగాలకు రెండు వారాల పాటు నిర్వహించిన మొబిలైజేషన్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. స్థానిక పోలీసుపరేడ్ మైదానంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఏఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పరిశీలన వాహనంపై వెళ్లి ఏఆర్ ప్లటూనను పరిశీలించి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్రంలోనే జిల్లా పోలీసులకు మంచి పేరుందన్నారు. ఏఆర్ సిబ్బందికి ప్రతి ఏటా మొబిలైజేషన్ కార్యక్రమం నిర్వహించి విధుల్లో నైపుణ్యం, ఫిజికల్ ఫిటెనెస్‌ను మెరుగుపరచడం ఆనవాయితీగా వస్తోందన్నారు. డీ మొబిలైజేషన్ పరేడ్‌ను క్రమశిక్షణతో అద్భుతంగా చేశారని పరేడ్ కమాండర్ వీరేశ్‌ను భినందించారు. అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. మొబిలైజేషన్‌లో ఫైరింగ్, టర్న్ అవుట్ అండ్ ప్రొఫిషియెన్సీ పే టెస్ట్, డ్రైవింగ్‌లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు ఆనంద్, వీరేశ్, శివరాముడు, టైటస్, శ్రీశైల రెడ్డి, ఆర్ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పారువేట

లక్కిరెడ్డిపల్లె జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురం గ్రామంలో గంగమ్మ జాతర సందర్భంగా శుక్రవారం పారువేట నిర్వహించారు. ప్రతి ఏటా లాగే పుష్యమాసంలో వచ్చే చొల్లంగి అమావాస్య తరువాత పాడ్యమినాడు యాదవ సామాజిక వర్గానికి చెందిన పూజారులు గొల్లపల్లెలోని అమ్మవారి ఇంటి నుంచి వేయి కనులచీర, జాకెట్, వెండికళ్లు, కోరలు, అమ్మవారి చిత్రకన్నును చెల్లు వంశీయులు బ్యాండ్ వాయిద్యాల మధ్య తీసుకువచ్చి గంగమ్మ దేవాలయంలో అప్పగించారు. శుక్రవారం తెల్లవారు జామున ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం గొర్రెను బలి ఇచ్చి పూజలు నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ రవీంద్రబాబు బందో బస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అమ్మవారి పూజారులు గంగరాజుయాదవ్, దినేష్‌యాదవ్ పాల్గొన్నారు.





అమ్మవారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు, ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



చెల్లు వంశీయుల ఇంటి నుంచి అమ్మవారికి వేయి కనుల చీర తీసుకెళుతున్న దృశ్యం

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

దెబ్బతిన్న కల్వర్టు.. పొంచి ఉన్న ప్రమాదం

● భయాందోళనలో ప్రయాణికులు

సిద్ధవటం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూలపల్లె గ్రామం మీదుగా కడపకు వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డు రహదారిపై కల్వర్టు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికులు, గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు.సంటిగారిపల్లె సమీపంలోని ఆర్అండ్‌బీ రోడ్డులోని బెస్తవంకపై 35 ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టు కింది భాగం పూర్తిగా దెబ్బతినింది. గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ మార్గంలో దూర ప్రాంతాల వాహనాలు, పాఠశాల విద్యార్థుల వాహనాలు, ఆటోలు ప్రయాణిస్తుంటాయి. వర్షాకాలంలో చెరువుకోన, మబ్బుకోన, ఎగువ ప్రాంతాలనుంచి వచ్చే నీరు పెద్ద ఎత్తున ఈ ఈ వంకలో ప్రవహిస్తూ ఉంటుంది. కల్వర్టు పూర్తిగా దెబ్బతినడంతో కూలిపోయే స్థితిలో ఉందని, అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్ అండ్ బీ ఏఈ గంగిరెడ్డి మాట్లాడుతూ దెబ్బతిన్న కల్వర్టును పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామన్నారు.


నెర్రెలుబారిన కల్వర్టు

చంద్రబాబు సభను విజయవంతం చేయండి

సంబేపల్లె, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ నిమిత్తం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం రాయచోటి నియోజక వర్గానికి వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభను విజయవంతం చేయాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సంబేపల్లెలోఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సభకు వచ్చే అధికారులు, ప్రజలకు భోజన ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి సభను విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజం పేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, టీడీపీ నాయకులు మౌర్యారెడ్డి, నిశ్చల్‌నాగిరెడ్డి, రవీంద్రారెడ్డి, నూరెకరాల రంగారెడ్డి, గాజుల ఖాదర్‌బాషా, సుగవాసి విద్యాధర్, విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నారా ప్రభాకర్‌నాయుడు, సుజాత, మట్టి శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

రాయచోటి టౌన్: గత ఏడాది డిసెంబర్‌లో పిడుగుపాటుకు గురై మృతి చెందిన సంబేపల్లె మండలం సోమ వరం గ్రామానికి చెందిన శెట్టిపల్లి శంకరమ్మ, శెట్టిపల్లి మల్లేశ్వరి కుటుంబ సభ్యులకు ఒక్కో కుటుంబానికి రూ.4 లక్షలు చొప్పున ఎక్స్ గ్రేషియా చెక్కులను అందజేశారు. ఠ రాయచోటి లోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి, మల్లు విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


పిడుగుపాటు మృతుల కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేస్తున్న మండిపల్లి

ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడిగా కేకే చౌదరి

రైల్వేకోడూరు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ ఎన్నికల పరిశీలకుడుగా అధిష్ఠానం తనను నియమించిందని రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు

భక్తులు సమర్పించిన వస్త్రాల వేలం

రాయచోటిటౌన్, జనవరి31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయానికి 2024 అక్టోబరు 12 నుంచి 2025 జనవరి 31వ తేదీ వరకు భక్తులు సమర్పించిన పంచలు, చీరలు, కండువాలు, టవల్స్ బహిరంగతో ద్వారా వీరభద్రాలయానికి రూ.2 లక్షల 10 వేలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో వెంకట్రమణారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ వేలంలో ఏడుగురు వ్యాపారులు పాల్గొనగా ఎస్ఎన్‌కాలనీకి చెందిన శ్రీ రాములు శెట్టి రూ.2.10 లక్షలకు 580 పంచలు, 800 చీరలు, 205 కండువాలు, 63 టవల్స్‌ను దక్కించుకున్నారు. జిల్లా దేవాదాయశాఖ అధికారులు రవికుమార్, జూనియర్ అసిస్టెంట్, ఈవో డీవీ రమణారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

సోమశిల బ్యాక్‌వాటర్‌లో చేప పిల్లల విడుదల

రాజంపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట మండలంలోని కోటపాడు వద్ద సోమశిల జలాల్లో శుక్రవారం ఉదయంత తహసీల్దారు వెంకటరమణమ్మ, మత్స్య శాఖ అధికారులు కిరణ్‌కుమార్, ప్రసన్న, భాస్కర్‌రెడ్డి 2 లక్షల చేప పిల్లలను వదిలారు. ప్రధానమంత్రి మత్స్య సంప్రదాయ యోజన కింద ఈ కార్యక్రమం నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, నాయకుడు ఎస్వీ రమణ, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

లక్కిరెడ్డిపల్లె, జనవరి 31(ఆంధ్రజ్యోతి); జాతీయ స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో 74 కిలోల కేటగిరిలో 450 కిలోల బరువునెత్తి ప్రథమ స్థానంలో నిలిచినట్లు దప్పేపల్లె పంచాయతీ మేడిమాకులగుంతకు చెందిన కొర్లకుంట నాగరాజు తెలిపారు. ఈ నెల 30, 31 తేదీల్లో సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జైపూర్‌లో ఈపోటీలు నిర్వహించినట్లు వివరించారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినం

రాజంపేట టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణంలోని అమ్మవారిశాలలో శుక్రవారం కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధే సత్యనారాయణ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గుండంలో ప్రవేశించారు. అమ్మ వారికి గ్రామోత్సవం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. అమ్మవారిని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు, టీడీపీ నేతలు, దర్శించుకున్నారు.

రైల్వేకోడూరు రూరల్: పట్టణంలోని కన్యకా పరమే శ్వరి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, గణపతి, నవగ్రహ శాంతి, వాసవీ హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అ లంకరించి కుంకుమార్చన చేశారు.


రాజంపేట: ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి

ఆర్యవైశ్య సంఘం, మహిళా మండలి సభ్యులు, దేవస్థానం కార్యనిర్వహణ అధ్యక్షుడలు కామిశెట్టి బాలాజీ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గునిశెట్టి రమేష్ పాల్గొన్నారు.

సుండుపల్లె: మండల కేంద్రంలోని కన్యకాపరమే శ్వరి ఆలయంలో శుక్రవారం వాసవీ మాత ఆత్మా ర్పణ దినం సందర్భంగా అభిషేకం, పూజలు నిర్వ హించారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలం కరించి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయంలో హోమం, అమ్మవారికి అభిషేకం నిర్వహించి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రామాపురం : నీలకంఠ్రావుపేట వాసవీ అమ్మవారి ఆలయంలో అర్చకులు ఉదయం మహాగణపతి పూజ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. మూలవిరాట్ ను అలంకరించి పూలమాలలు వేశారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాయచోటిటౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలనిశుక్రవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నేతలు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాయచోటి పర్యటనకు వస్తున్న నేపథ్యంలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను మాట్లాడే అవకాశం కల్పించి ఆ సమస్యలపై చర్చించాలని మంత్రిని కోరారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన మంత్రి మీ విషయాన్ని మీ ముందే ముఖ్యమంత్రికి తెలియ పరిచి సమస్య త్వరితగతిన పరిష్కారానికి సహకరిస్తానని తెలియజేశారు. డిస్కమ్ అధ్యక్షుడు కే. సుబ్రమణ్యంరాజు, డివిజన్ అధ్యక్షుడు నాగేశ్‌గౌడ్, యునెటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ డివిజన్ కార్యదర్శి ఏవీ రమణ, కాంట్రాక్టు కార్మికులు జగదీశ్, రామాంజుల్‌రెడి కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

రాజంపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అన్నమాచార్య యూనివర్సిటీలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈనెల 28 నుంచి ఈ శిక్షణ కార్యక్రమాన్ని నాలుగురోజుల పాటు నిర్వహించారు. ఈ శిబిరంలో 5 ఆంధ్రా గర్ల్స్ బెటాలియన్ శిక్షకులు నాయబ్ సుబేదార్, వెంకటేశ్, సీహెచ్ఎం కర్నాల్‌సింగ్, శిక్షకులుగా వ్యవహరించారు. క్రమశిక్షణ, నాయకత్వం, శారీరక సామర్థ్యం తదితర అంశాలపై శిక్షణ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ, వైస్ చైర్మన్ ఎల్లారెడ్డి, రిజిస్ట్రార్ మల్లికార్జునరావు, డాక్టర్ బి.నాగముని, ఎం.దీప్తి, సైపుల్లా, తదితరులు పాల్గొన్నారు.

కంటి అద్దాలు పంపిణీ

రాజంపేట టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జ్యోతి లెప్రసీ కాలనీలో ఇటీవల నిర్వహించిన కంటి పరీక్షల్లో దృష్టిలోపం నిర్ధారణ అయిన 36 మందికి హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్థిక సహాయంతో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సానె శేఖర్ శుక్రవారం కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్‌హ్యాండ్ ప్రతినిధులు పి.వెంకటరమణ, శివాజీ, మణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెంచాలి

రాజంపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, శాన్వి ఇంటర్నేషనల్ కరస్పాండెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజు సూచించారు. రాజంపేట మండలం శాన్వి ఇంటర్నేషనల్ క్రీడా మైదానంలో శుక్రవారం క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతో పాటు జ్ఞాపకశక్తి పెంపొందుతుందన్నారు. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయన్నారు.రాష్ట్ర ఎస్టీయూ అధ్యక్షుడు వై.సుబ్రమణ్యం రాజు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనరసయ్య, ప్రిన్సిపాల్ విజయనిర్మల, డైరెక్టర్ కొండూరు శరత్‌కుమార్‌రాజు, వైస్ ప్రిన్సిపాల్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలి

పుల్లంపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పుల్లంపేట ఎస్టీయూ అధ్యక్షుడు సయ్యద్‌హుస్సేన్ శుక్రవారం ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న జీవో 117 సవరణ ప్రక్రియ సంఘాలతో చర్చించిన అంశాలకు భిన్నంగా ఉందని దీనివల్ల విద్యార్థులకు నష్టం కలుగుతుందన్నారు. సమీప పాఠశాలల విలీన ప్రక్రియ ఆలోచన వెంటనే విరమించుకోవాలని, లేనిపక్షంలో 6, 7, 8 తరగతుల విద్యార్థులు దూరంగా ఉన్న హైస్కూల్‌కు వెళ్లలేక చదువు మానేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ఎక్కడ ఉంటే అక్కడ మోడల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పి, ప్రస్తుతం 40 నుంచి 45కు కుదించడం అన్యాయం అన్నారు. ప్రభుత్వం పునరాలోచించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు నష్టం కలగకుండా చూడాలని కోరారు.

దళితవాడల్లో సమస్యలపై ఆరా..

సుండుపల్లె, జనవరి31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ తోటి హరిజనవాడలో శుక్రవారం సివిల్స్ డే నిర్వహించినట్లు తహసీల్దార్ దైవాధీనం తెలిపారు. తాగునీరు, బడి, అంగన్వాడీ వంటి వసతులపై ఆరా తీశామన్నారు. గ్రామంలో రోడ్లను పరిశీలించినట్లు తెలిపారు. చిన్నారులను బడికి పంపాలని తల్లిదండ్రులకు సూచించామన్నారు. భూ సమస్యలు ఉంటే తమ కార్యాలయానికి వచ్చి పరిష్కరించు కోవాలని సూచించినట్లు తెలిపారు.

ఏపీఎండీసీ స్కూల్ కార్మికులకు న్యాయం చేయాలి

ఓబులవారిపల్లె, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎండీసీ సీఎస్ఆర్ నిధులతో నడుస్తున్న స్కూల్లో పనిచేసే కార్మికుల సమస్యలు పట్టించుకోవాలని ఎంపీడీవో మల్‌రెడ్డికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు, భూములు ఏపీఎండీసీకి ఇచ్చి కార్మికులుగా పనిచేస్తున్నవారిని అన్యాయం గా తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. ఇది ప్రైవేటు స్కూల్ కాదని, నిబంధనలకు వ్యతిరేకంగా కార్మికులను తొలగించడం దుర్మార్గమన్నారు. నిబంధనలు పాటించని స్కూల్ నిర్వాహకులపై ఎంపీడీవో చర్యలు తీసుకోవాలని కోరగా, విద్యాశాఖాధికారులు, జిల్లా అధికారులు యాజమాన్యం దృష్టికి సమస్యను తీసుకెళతామని ఎంపీడీవో హామీ ఇచ్చారని తెలిపారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు పెంచలయ్య, సీఐటీయూ మండల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వేడుకగా గంధం ఉత్సవం

రాయచోటిటౌన్, జనవరి 31 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలో ని యూసుఫ్‌షా ఖాదరి నగర్‌లో ఉన్న హస న్‌దాదా షావలి సా హెబ్ బాబా దర్గాలో శుక్రవారం జరిగిన గం.దం ఉత్సవంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన దర్గా కమిటీ సభ్యు లు ముస్లిం నేతలతో చదివింపులు, ప్రార్థనలు నిర్వహించారు. అనం తరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ముమ్మరంగా ఆక్రమణల తొలగింపు

రైల్వేకోడూరు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న స్థలాల ఆక్రమణలపై రైల్వేకోడూరు పంచాయతీ అధికారులు ఉక్కు పాదం మోపారు. శుక్రవారం పట్టణంలోని టోల్‌గేట్ సమీపంలోని చర్చి కాంపౌండ్ వద్ద ఉన్న ఆక్రమణ నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈవో ప్రసాద్ మాట్లాడుతూ ఆక్రమణదారుల కు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు సుబ్రహ్మణ్యం మాజీ ఉప సర్పంచ్ వార్డు మెంబర్ నార్జాల హేమరాజ్, మైనారిటీ నాయకులు పట్టాన్ అల్లాబకష్, టీడీపీ నాయకుడు అరవింద్ పాల్గొన్నారు.


ఆక్రమణల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న పంచాయతీ ఈవో ప్రసాద్

కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలి

సిద్దవటం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను నిర్మించాలని, సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలంటూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జ మ్మలమడుగులో గురు వారం ప్రారంభించిన జీపు జాతా శుక్రవారం సిద్దవటం చేరుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ ఈ నెల 27న నెల్లూరులో నిర్వహించనున్న మహాసభలను విజయ వంతం చేయాలని, కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికసంఘం, జిల్లా కార్యదర్శి వి.అవినేష్, భైరవ ప్రసాద్, పోరుమామిళ్ల మండల శాఖ కార్యదర్శి సుబ్బమ్మ, సిద్దవటం మండల కార్యదర్శి పి. సురేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

రైల్వే కోడూరు స్టేషన్‌లో రైళ్లను నిలపాలి

రైల్వేకోడూరు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో రాజంపేట పార్లమెంట్ పరిధిలో ఆపివేసిన రైళ్ల స్టాపింగ్‌ను పునరుద్ధరించాలని రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌ను గుంతకల్ రైల్వే డీఆర్‌సీసీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ఆయన కు వినతిపత్రం అందజేశారు. రాజంపేట, గుంతకల్ నుంచి కుంభమేళాకు ప్రత్యేక రైళ్లను నడపాలని కోరారు. రైల్వేకోడూరు రైల్వే స్టేషన్ ముఖద్వారం వద్ద ఆర్చ్ ఏర్పాటు చేయాలని విన్నవించారు.


రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతి పత్రం ఇస్తున్న తల్లెం భరత్

టీడీపీ కార్యకర్తకు సుగవాసి పరామర్శ

రాయచోటిటౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గుండె ఆపరేషన్ చేయించు కుని ఇంటికి వచ్చిన టీడీపీ కార్యకర్తను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు పరామర్శించారు. శుక్రవారం మండలంలోని పెమ్మాడపల్లె పంచాయతీ గరుగు పల్లెలోని బాధితుడు ఓర్సు ఆంజనేయులు ఇంటికి చేరుకుని ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు.


టీడీపీ కార్యకర్తను పరామర్శించిన సుగవాసి ప్రసాద్‌బాబు

ఫీజుల పేరుతో దొంగ ఉద్యమాలు ఆపాలి

రాజంపేట టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఫీజుల పేరుతో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫిబ్రవరి 5న నిర్వహించనున్న దొంగ ఉద్యమాలను ఆపాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో 2000 కోట్లు బకాయిలు పెండింగ్‌లో పెట్టి జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నాడని ధ్వజ మెత్తారు. అలాంటి వ్యక్తి ఫీజు పోరు పేరుతో ధర్నాకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నా రు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలలకే 788 కోట్లు విడుదల చేసి 10 లక్షల మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇప్పించి విద్యార్థుల జీవితాల్లో వెలుగునింపిన ఘనత విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు దక్కుతుందన్నారు. జగన్‌రెడ్డి తన ఉనికి కోసం చేసే ఉద్యమాలు ఎప్పటికీ ఫలించవని, ప్రజలు, విద్యార్థులే తిరగబడి తరిమికొడతారని హెచ్చరించారు. టీఎన్ఎస్ఎఫ్ పోలి శివకుమార్, సాయిప్రసాద్, శివప్రసాద్, మోబినిస్ పాల్గొన్నారు.

ఆటోలు అధిక లోడుతో వెళితే చర్యలు

లక్కిరెడ్డిపల్లె, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అధిక లోడుతో వెళ్లే ఆటోలపై చర్యలు తప్పవని ఎస్ఐ రవీంద్రబాబు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలో కెపాసిటీకి మించి ప్రయాణికులను తీసుకెళ్లడం కారణంగా, అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రైవర్ కుడివైపున ఎవరూ కూర్చోకుండా పూర్తిగా మూసివేయాలన్నారు. మద్యం తాగి ఆటో నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు.ముఖ్యంగా స్కూల్ విద్యార్థులను ఆటోలో తీసుకెళ్లేవారు జాగ్రతగా ఉండాల న్నారు. ఆడపిల్లలను వేధిస్తే కఠినమైన చర్యలు తీసుకుం టామన్నారు. ఆటో స్టాండ్‌లో మాత్రమే వాహనాలను నిలపాలన్నారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రిమాండ్‌కు ఎస్‌ఐ, సీఐ



మీడియాతో మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి

రామసముద్రం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): లారీ ప్రమాదం కేసులో సీజ్ చేసిన లారీని విడిపించేందుకు లారీ ఓనర్ నుంచి రూ.70 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన రామసముద్రం ఎస్‌ఐ వెంకట సుబ్బయ్యను ఇందులో ప్రమేయం ఉన్న సీఐ రమేష్‌లను శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి తెలిపారు. ఇందులో ఏ1గా ఎస్‌ఐ, ఏ2గా సీఐ ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ కేసుకు సంబంధించి గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ, సీఐలతో పాటు మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడును ఏసీబీ అధికారులు విచారణ చేశామన్నారు. కాగా మదనపల్లెలోని ఎస్‌ఐ, సీఐ ఇళ్లలోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా మండలంలోని పోలీస్‌స్టేషన్‌లోకి మీడియాతో పాటు ఎవరినీ అనుమతించకపోవడంతో ఏం జరుగుతోందని ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. పోలీసుల పనితీరుపై ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- క్లస్టర్ కేంద్రంగా విద్యా కార్యక్రమాలు
- డీఈవో సుబ్రమణ్యం, డీవైఈవో శివప్రకాశ్‌రెడ్డి



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ సుబ్రమణ్యం

సంబేపల్లె, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని, అందుకు ఉపాధ్యాయులు తోడ్పాటును అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, ఉప విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డిలు సూచించారు. శుక్రవారం సంబేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో వారు మాట్లాడారు. సంగ్రహణాత్మక పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా పదవ తరగతి విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజించి వెనుకబడిన వారు కూడా ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. ఎస్సీఈఆర్టీ రూపొందించిన 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. సంబేపల్లెలో శనివారం సీఎం చంద్రబాబు పర్యటన దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం మెనూ తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారి శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మామూళ్ల మద్యం..!



తక్కువ ధరకే నాణ్యమైన మద్యం ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. అయితే మద్యం విక్రయాల్లో షాపు యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నా పట్టించుకోవడం లేదు. పట్టణాలు, పంచాయతీల్లో షాపులకు అనుబంధంగా అనధికార సిట్టింగ్ గదులు, గ్రామాల్లో బెల్టు దుకాణాలు విచ్చలవిడిగా వెలిశాయి. బార్లను తలపించేలా వ్యాపారాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో ఉండడంతో నడిరోడ్డుపై మద్యం తాగుతున్నా అటువైపే చూడడం లేదు. చిల్లర దుకాణాల్లోనూ మందుబాబులు మత్తులో తూగుతున్నారు.

- తెగ తాపిస్తున్నారు..!!
- షాపులే బార్లలా..
- పల్లెపల్లెకూ బెల్టు.. అటు చూస్తే ఒట్టు
- తాట తీలేదు.. బెల్టూ తీలేదు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్



మద్యం షాపునకు అనుబంధంగా నడుస్తున్న అనధికార సిట్టింగ్

మదనపల్లె, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మద్యం షాపులకు అనుబంధంగా సిట్టింగ్ రూములు పెట్టినా, పల్లెల్లో ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహించినా తాట తీస్తా. బెల్టు తీస్తా. అలా ఎవరైనా చూస్తే, మొదటి విడతగా కేసు నమోదు చేస్తాం. అదే వ్యక్తే రెండోసారి పట్టుబడితే మద్యం షాపు లైసెన్సు కూడా రద్దు చేస్తామని ఎక్సైజ్‌శాఖ మంత్రి నుంచి సీఎం చంద్రబాబునాయుడు వరకూ చెబుతున్న మాటలివీ. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్టోబరు 15న కొత్తమద్యం పాలసీతో దుకాణాలు అమలులోకి వచ్చాయి. కానీ పట్టణమే కాదు.. పల్లెల్లోనూ మద్యం పాలసీగానీ, సీఎం ఆదేశాలు కానీ ఎక్కడా అమలు కాలేదు. పట్టణాలు, పంచాయతీల్లో షాపులకు అనుబంధంగా అనధికార సిట్టింగ్ గదులు, గ్రామాల్లో బెల్టు దుకాణాలు విచ్చలవిడిగా వెలిశాయి. ఓ విధంగా చెప్పాలంటే.. పట్టణాల్లో షాపులే బార్లు లాగా మార్చి తెగతాపిస్తుండగా, షాపునకు అనుబంధంగా ఉన్న పల్లెలకూ మద్యం సరఫరా చేస్తున్నారు. పట్టణాల్లో మాత్రం ఎంఆర్‌పీ ధరలకే విక్రయిస్తుండగా, బెల్టు షాపుల్లో మాత్రం క్వార్టర్ బాటిల్‌పై రూ.20 అదనంగా వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. పట్టణంలో ఒక్కోషాపు 400 చ.అ. విస్తీర్ణంలో ఉంటే, దానికి అనుబంధంగా అంతకు పదింతులు, వందరెట్ల విస్తీర్ణంలో సిట్టింగ్ గదులు, హాలులు ఏర్పాటు చేశారు. కొందరైతే గోదాము తరహాలో పైన రేకులు, కూర్చోడానికి బల్లలు, నిర్మాణ దిమ్మెలు ఏర్పాటు చేశారు. దీంతో మందుబాబులు అక్కడే తాగి, అక్కడే తూగుతూ నిద్రపోవడానికి కావాల్సిన వాతావరణాన్ని కల్పించారు.

జిల్లాలో పెద్ద పట్టణంగా పేరున్న మదనపల్లె మున్సిపాలిటీలో మద్యం దుకాణాలు బార్లను తలపిస్తున్నాయి. షాపులకు అనుబంధంగా సిట్టింగ్ రూములు ఏర్పాటు చేసి తెగ తాపిస్తున్నారు. పట్టణంలో పది దుకాణాలు, తిరుపతిరోడ్డు, బెంగళూరురోడ్డు, పుంగనూరురోడ్డుతో పాటు సీటీఎంతో కలిపి మొత్తం 14 మద్యం షాపులు ఉన్నాయి. వీటిలో మూడు, నాలుగు షాపులు మినహా అన్నింటిలోనూ సిట్టింగ్ సౌకర్యం కల్పించి తాపిస్తున్నారు. అలాగే మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మొత్తం 22 దుకాణాలు ఉండగా, అందులో మిగిలిన రామసముద్రం, నిమ్మనపల్లె మండలాల్లో ఒక్కొక్కటి, కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లో మూడు చొప్పున మొత్తం ఎనిమిది దుకాణాలు ఉన్నాయి. వీటిలోనూ మదనపల్లె తరహా పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఇక్కడ ప్రతిచోటా షాపులు, సిట్టింగ్ రూముల వద్ద మద్యం ప్రియులకు చికెన్, చేప, గోడిగుడ్డు, ఇతర ఐటమ్స్ కూడా అక్కడే అందుబాటులో ఉంచారు. కొందరు అక్కడే బహిరంగంగా తాగేసి వెళ్లిపోతున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన ఎక్సైజ్, సివిల్ పోలీసులు దుకాణాల నుంచి నెలవారి మామూళ్లు ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నారు. మదనపల్లెలో ఒక్కో దుకాణం నుంచి ఏరియాను బట్టి నెలకు రూ.40 వేల నుంచి 50 వేలు వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

సిట్టింగ్ రూములపై చర్యలు

- భీమలింగ, ఎక్సైజ్ సీఐ, మదనపల్లె

మద్యం షాపునకు అనుబంధంగా ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. అలా ఎవరైనా, ఎక్కడైనా అనధికారికంగా నిర్వహిస్తుంటే చట్టవిరుద్ధం. అది నేరం కూడా. అలాంటి వాటిపై చర్యలు తీసుకుంటాం. తాము ఏ దుకాణదారుని నుంచీ డబ్బులు తీసుకోలేదు.

అలాగే మదనపల్లె ఎక్సైజ్ పరిధిలోని అంగళ్లు, బి.కొత్తకోటతో పాటు ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ములకలచెరువులో రూ.30వేలు, మిగిలిన మండలాల్లో వ్యాపారాన్ని బట్టి రూ.15వేల నుంచి రూ.20వేలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ మొత్తాన్ని ఎక్సైజ్, సివిల్ పోలీసుల పేరుతో వసూలు చేస్తున్నట్లు దుకాణదారులే బహిరంగంగా చెబుతున్నారు. అయితే ఈ విధానాన్ని ఇద్దరు లేదా ముగ్గురు షాపుల యజమానులు తిరస్కరించిన్నట్లు తెలిసింది. ఇదిలా వుండగా, పట్టణంలోని నీరుగట్టువారిపల్లె, తదితర శివారు ప్రాంతాల్లోని చిన్నచిన్న హోటళ్లతో పాటు జాతీయ రహదారుల వెంట ఉన్న కొన్ని డాబాల్లోనూ మద్యం తాగడానికి అనుమతిస్తున్నారు. మద్యం లేనిదే వ్యాపారం ఉండదన్నట్లుగా నిర్వాహకులు భావిస్తున్నారు.

మదనపల్లె, ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని మదనపల్లె, రామసముద్రం, నిమ్మనపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, పెద్దమండ్యం మండలాల పరిధిలో మొత్తం 32 దుకాణాలు ఉన్నాయి. అయితే అన్ని గ్రామాల్లో బెల్టు దుకాణాల్లో సంపూర్ణంగా మద్యం దొరుకుతోంది. ఆయా షాపు పరిధిలోకి వచ్చే గ్రామాలకు కొన్ని చోట్ల ప్రత్యేకంగా మనిషిని ఏర్పాటు చేసి సరఫరా చేస్తుండగా, కొన్నిచోట్ల మాత్రం బెల్టు నిర్వాహకులే షాపు వద్దకు వచ్చి తమకు కావాల్సిన బ్రాండ్లను తీసుకెళ్తున్నారు. కొన్ని గ్రామాల్లో చిల్లర దుకాణంలో నిర్వహిస్తుండగా, మరికొన్ని గ్రామాల్లో నాటుసారా విక్రయించే వారు ఇంట్లో పెట్టుకుని మందు ప్రియులకు రహస్యంగా చేరుస్తున్నారు. పట్టణాల్లో షాపునకు అనుబంధంగా, అక్కడ అవకాశం లేకుంటే కొంతదూరంలోనో, ఎదురుగానో రూములు, స్థలాలు తీసుకుని అదనపు ఖర్చు చేసి షెడ్లు నిర్మించారు. పల్లెలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఇదిలావుండగా మద్యం దుకాణాలకు అనుబంధంగా అనధికార సిట్టింగ్‌లతో బార్ల యజమానులు తీవ్రంగా నష్టపోతున్నట్లు చెబుతున్నారు. వీటిపై చర్యలు తీసుకోకుంటే బార్‌లను మూసేయడమే మేలని, ఫలితంగా బార్ నిర్వహణకు అయ్యే ఖర్చులైనా మిగులుతాయని వారు భావిస్తున్నట్లు వాపోతున్నారు.



రోడ్డుపై తాగుతున్న మద్యం ప్రియులు



సిట్టింగ్ హాలులో మద్యం ప్రియులు



చిల్లర దుకాణానికి అనుబంధంగా నడుస్తున్న బెల్టుషాపు

భూతగాదాలతో రైతు ఆత్మహత్య...!

- జాతీయ రహదారిపై కుటుంబ సభ్యుల ధర్నా



మృతుడు రామకృష్ణారెడ్డి (ఫైల్‌ఫొటో)




మార్కెట్‌యార్డు వద్ద మృతదేహంతో ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

గుర్రంకొండ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భూతగాదాలతో ఓ రైతు ఆత్మహత్య చేసుకొన్న సంఘటన తలారివాండ్లపల్లె వద్ద శుక్రవారం ఉదయం చోటు చేసుకొంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని గుర్రంకొండ పంచాయతీ తలారివాండ్లపల్లెకు చెందిన రేగంటి రామకృష్ణారెడ్డి(50)కి అదే గ్రామానికి చెందిన సి.రమణారెడ్డి కుటుంబానికి కొన్నేళ్లుగా భూతగాదాలున్నాయి. ఈ క్రమంలో పదిహేను రోజుల క్రితం భూముల విషయమై గొడవపడి కేసులు పెట్టుకున్నారు. రామకృష్ణారెడ్డి(50)ను చంపుతానంటూ పలుమార్లు రమణారెడ్డి బెదిరించినట్లు మృతుడి భార్య అమృత తెలిపిందన్నారు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన రామకృష్ణారెడ్డి గురువారం రాత్రి పొలం వద్దకు వెళ్లి ఉరివేసుకొని మృతి చెందాడు. కాగా పొలం వద్దకు వెళ్లిన భర్త ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో ఉదయం పొలం వద్ద కుటుంబ సభ్యులు చూడగా ఉరేసుకొని వేలాడుతున్నట్లు తెలిపారు. విషయాన్ని పోలీసు లకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఇదిలా ఉండగా భూతగాదాలతో తన భర్త చనిపోయేందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ భార్య కుటుంబ సభ్యులతో కలిసి గుర్రంకొండ-బెంగుళూరు జాతీయ రహదారిపై మార్కెట్ యార్డు వద్ద ధర్నా చేశారు. తప్పుడు రెవెన్యూ రికార్డులను సృష్టించి గ్రామస్థులను ఇబ్బంది పెడుతున్న రమణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌ఐ మధురామచంద్రుడు బాధితులకు సర్దిచెప్పడంతో ధర్నా విరమించారు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా.. తలారివాండ్లపల్లెలో రమణారెడ్డి కుటుంబానికి, రేగంటి రెడ్డెప్ప కుమారులకు భూ సమస్యలున్నాయి. ఈ భూముల సమస్యలపై ఇరువర్గాల వారు కోర్టును ఆశ్రయించారు. కేసులు నడుస్తున్నాయి. రెవెన్యూ రికార్డులను పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

నీరు-చెట్టు పెండింగ్ బిల్లులు రూ.18.70 కోట్లు

మదనపల్లె, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్‌లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన నీరు-చెట్టు పనుల బిల్లులు రూ.18.70 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. డివిజన్‌లోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో 2014 నుంచి 2019 వరకూ చేపట్టిన పనుల్లో 265 పనులకు సంబంధించి రూ.18.70 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. భూగర్భజలాలను వృద్ధి చేసే క్రమంలో అప్పటి, ఇప్పటి సీఎం చంద్రబాబు నీరు-చెట్టు పనులు చేపట్టారు. మొదట్లో చేపట్టిన పనులకు బిల్లులు మంజూరు కాగా, ఎన్నికల ముందు 2018-19లో చేపట్టిన పనుల బిల్లుల చెల్లింపునకు బ్రేక్ పడింది. తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో నీరు-చెట్టు పనులను నిలిపేశారు. ఈ నేపథ్యంలో చాలామంది కోర్టును ఆశ్రయించినా.. కొందరికి మినహా అందరికీ చెల్లించలేదు. తిరిగి 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆశలు రేకెత్తాయి.

కల నెరవేరేనా..!



పుష్కలంగా నీరు ఉన్న వెలిగల్లు ప్రాజెక్టు

దేశానికి రైతే వెన్నెముక. రైతన్నలు పండించే పంటలతోనే దేశం సుభిక్షంగా ఉంటుంది. కానీ గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. వ్యవసాయానికి కావాల్సిన నీరు అందించడంలో విఫలమైంది. చేసేదేమీ లేక.. వ్యవసాయంపై మక్కువ చంపుకోలేక.. రైతులే లక్షలు వెచ్చించి బోరుబావులు వేసినా నీటిజాడే కనిపించడం లేదు. వెయ్యి అడుగులు వేసినా నీటిచుక్క లేదని రైతులు లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా 25 వేల ఎకరాల సాగు భూమి ఉంది. కూటమి ప్రభుత్వంలోనైనా వెలిగల్లు ద్వారా నీటిని అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

- వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపం
- వెయ్యి అడుగులు వేసినా జాడలేని నీటి చుక్క
- ఎడారిని తలపిస్తున్న వేలాది ఎకరాల వ్యవసాయ భూములు
- నీళ్లు లేక ఎండిపోతున్న మామిడి తోటలు
- 'కూటమి'లోనైనా వెలిగల్లు ఎత్తిపోతల పథకానికి మోక్షం లభించేనా ?

గాలివీడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గత 5 సంవత్సరాల వైసీపీ ప్రభుత్వంలో మండల ప్రజలకు తాగు, సాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమైంది. వెలిగల్లు ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ వీటిని చెరువులకు, కుంటలకు, భూములకు నీరు అందించలేని దుస్థితిలో అప్పటి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కరువు కాటకాలకు నిలయమైన ఈ ప్రాంతం వెలిగల్లు ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా అన్ని గ్రామాలకు తాగు, సాగునీరు అందించాలని రైతులు అప్పటి ప్రజాప్రతినిధుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా వారు పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెలిగల్లు ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం ద్వారా కనీసం చెరువులకు నీరు నింపి ఉంటే ఈ రోజు వ్యవసాయంతో పాటు మామిడి తోటలను కూడా కాపాడుకొనేవారమని రైతులు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చేసిన నిర్లక్ష్యం వలన మండల రైతాంగానికి శాపంగా మారింది. మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 25 వేల ఎకరాల సాగు భూమి కలదు. అన్ని పంచాయతీల్లో 200 వరకు చెరువులు, కుంటలు ఉన్నాయి. వెలిగల్లు, కుషావతి ప్రాజెక్టుల ద్వారా 6 పంచాయతీల్లో 7 వేల ఎకరాల వరకు సాగు భూమి, మిగిలిన 18 వేల ఎకరాల వ్యవసాయ భూములు వర్షాధారంపై ఆధారపడి సాగు చేస్తున్నారు. వీటితో పాటు మరో 2 వేల ఎకరాలకు పైగా మామిడి, జామ, సపోట, అరటి, నిమ్మ వంటి పండ్ల తోటలను సాగు చేస్తున్నారు.



చుక్కనీరు లేక బోసిపోయిన మొరగలచెరువు

కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు

మండల కేంద్రానికి కూతవేటు దూరంలో పాపాఘ్ని నదిపై 4.64 టీఎంసీల నీటి సామర్థ్యంతో వెలిగల్లు ప్రాజెక్టును నిర్మించారు. ఈ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా 24 వేల ఎకరాలకు (మూడు మండలాల పరిధిలో) సాగునీరు, రాయచోటి పట్టణానికి తాగునీరు అందిస్తున్నారు. అయితే ప్రాజెక్టు ఉన్న మండలమైన గాలివీడులో మాత్రం రైతాంగానికి, ప్రజలకు సాగు, తాగునీరు అందడం లేదు. మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు గానూ గరుగుపల్లి, పందికుంట, తూముకుంట, కొర్లకుంట పంచాయతీల్లో మాత్రమే పూర్తి స్థాయిలో భూములకు సాగునీరు అందుతుండగా గుండ్లచెరువు, పేరంపల్లి, బోరెడ్డిగారిపల్లె పంచాయతీల్లో 4 వంతుల వ్యవసాయ భూముల్లో ఒక వంతు వ్యవసాయ భూములకు నీరు సౌకర్యం అందుతోంది. మిగిలిన 10 పంచాయతీల్లోనూ వ్యవసాయ భూములకు ఒక చుక్క నీరు కూడా అందలేదు. అయితే ఈ గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూములకు వెలిగల్లు ఎత్తిపోతల పథకం ద్వారా నీటి సౌకర్యం కల్పించలేదు. ముఖ్యంగా చీమలచెరువుపల్లె రెండు వేల ఎకరాలు, నూలివీడు మూడు వేల ఎకరాలు, గోపనపల్లె రెండు వేల ఎకరాలు, ఎగువగొట్టివీడు రెండు వేల ఎకరాలు, గుండ్లచెరువు 1500 ఎకరాలు, గోరాన్‌చెరువు మూడు వేల ఎకరాలు మొత్తం 13,500 ఎకరాలు మెట్ట, మాగాని భూములు కలవు. ఈ గ్రామాల కింద దాదాపుగా 60 వరకు కుంటలు, చెరువులు కలవు. అయితే ఈ గ్రామాల్లో 2 వేల ఎకరాలకు పైగా మామిడి తోటలు ఉన్నాయి. నీటి సౌకర్యం లేకపోవడం వలన వ్యవసాయ భూములన్నీ ఎడారిని తలపిస్తున్నాయి. అయితే మామిడి తోటలను కాపాడుకునేందుకు అప్పులు చేసి ఒక్కో రైతు 5 నుంచి 15 బోర్లు వెయ్యి అడుగుల లోతు వరకు వేసినా నీటి జాడ లేదు. దీంతో రైతులు చేసిన అప్పులు తీర్చుకోలేక కొంత మంది భూములను అమ్ముకుంటుండగా, మరి కొందరు జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారు.



ఎండిపోయిన మామిడితోట

2014లో టీడీపీ ప్రభుత్వ కాలంలో వెలిగల్లు ప్రాజెక్టు నుంచి నీటి సౌకర్యానికి వ్యవసాయ భూము లకు నీటిని అందించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ముఖ్యంగా వెలిగల్లు ప్రాజెక్టు కుడికాలువ ద్వారా గుండ్లచెరువు పంచాయతీలోని గండిచెరువుకు నీటిని తరలించి అక్కడి నుంచి లిఫ్ట్ ద్వారా కమలా మర్రిలోని పడమటపల్లెకు సమీపంలో ట్యాంక్‌ను ఏర్పాటు చేసి తద్వారా కాలువల ద్వారా వివిధ గ్రామాల్లోని చెరువులకు సాగునీటిని అందించేందుకు పథక రచన చేశారు. కానీ 2019లో ప్రభుత్వం మారిపోవడంతో ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వెలిగల్లు ఎత్తిపోతల పథకాన్ని అటకెక్కించింది. ఈ పథకం గురించి 5 ఏళ్ల కాలంలో ప్రజాప్రతినిధులకు వందసార్లు రైతులు విన్నవించుకున్నప్పటికీ వారు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పుడు నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వమైనా వెలిగల్లు ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించాలి

- వేణుగోపాల్‌రెడ్డి, కుమ్మరపల్లి, నూలివీడు



నాకు 30 ఎకరాల్లో మామిడి తోట, 10 ఎకరాలు మెట్ట, మాగాని భూములు కలవు. ఈ మామిడి తోటలను కాపాడుకునేందుకు వెయ్యి అడుగుల లోతుతో 15 వ్యవసాయ బోర్లు వేశాను. ఒక్కో బోరుకు సుమారు రూ.2 లక్షలు ఖర్చు చేశాను. వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో మొత్తం 15 బోర్లకు గానూ కేవలం రెండు బోర్లల్లో మాత్రమే నీళ్లు వస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం వెలిగల్లు ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం ద్వారా కనీసం చెరువులకు నీటిని అందిస్తే మామిడి చెట్లను కాపాడుకోవచ్చు.

ఆత్మస్థైర్యం నింపేందుకు...

- ప్రభుత్వ పాఠశాలల్లో ఆత్మరక్షణ కార్యక్రమం
- 422 పాఠశాలల్లో 33,712 మందికి శిక్షణ
- ఫిబ్రవరి 1 నుంచి మార్చి 15 వరకు..





కడప ఎడ్యుకేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బాలికల్లో ఆత్మస్థైర్యం పెంచేందుకు సర్కారు పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కరాటేతో పాటు మరికొన్ని సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణను నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమాన్ని చేపడుతోంది. అమ్మాయిలపై దాడుల, అత్యాచారాలు ఎదుర్కోనేందుకు బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ కోసం పాఠశాలస్థాయి నుంచే ఉచితంగా కరాటే, జూడో వంటి శిక్షణలు ఇవ్వనున్నారు.

రాష్ట్రంలో చదువుతున్న ఆడపిల్లలు సంరక్షణ కోసం ఆత్మరక్షణ కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో అమలు చేసేం దుకు రాష్ట్ర విద్యాశాఖ శ్రీకార చుట్టింది. ఇందులో భాగంగా వైఎస్సార్ జిలల్లాలో 422 పాఠశాలల్లోని 33712 మంది బాలికలకు ఆత్మరక్షణ శిక్షణ చేపట్టనున్నారు. ఫిబ్రవరి 1 నుంచి మార్చి 15 వరకు 20 సెక్షన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది. ప్రతిరోజు 60 నిమిషాలు ఉంటుంది. ఇందుకు సంబంధించి యాక్షన్ ప్లాన్ కూడా విడుదలైంది. బాలికల ఆత్మరక్షణకు సంబంధించి తైక్వాండో, ఉషు, కరాటే, జూడో, వెస్టన్ బాక్సింగ్, కిక్ బాక్సింగ్, రెజ్లింగ్, క్రావ్ మాగా, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ), ఐకిడో, జీత్ కునే దో, ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ (కలరిపయట్టు వంటివి)లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఆత్మరక్షణ కార్యక్రమం ద్వారా బోధించే కరాటే శిక్షణ బయటి శత్రువులతో పోరాడడమే కాకుండా అంతరంగిక శత్రువులైన కోపం, చిరాకు, జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఆత్మవిశ్వాసంతో తేలికగా పరిష్కరించడం లో సహాయపడుతుంది.

ఆత్మరక్షణ తరగతులు ఎందుకంటే...

ఆత్మరక్షణ తరగతులు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని మరియు స్వీయ క్రమశిక్షణను పెంపొందించడానికి.. వారి శారీరక స్థితిని మెరుగుపరచడానికి సహాయపడతాయి. ప్రత్యేకించి తరగతులు ముగిసిన తర్వాత రాత్రిపూట ఒంటరిగా నడుస్తున్నప్పుడు విద్యార్థులకు ఇది సహాయపడుతుంది. స్వీయరక్షణ ప్రాథమికాలను నేర్చుకోవడం ద్వారా ప్రమాదకరమైన మరియు ఊహించలేని పరిస్థితులకు తమను తాము సిద్ధం చేసుకోవడంలో సహాయపడుతుంది. ఇది విద్యార్థులకు ఆత్మగౌరవం గురించి బోధిస్తుంది. స్వీయ రక్షణ తరగతులు ఆత్మగౌరవం, భయాన్ని అధిగమించడం, అవగాహన/హెచ్చరిక మరియు స్వీయ గౌరవం వంటి అనేక మానవ సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో సహాయపడతాయి. ఆత్మరక్షణ తరగతులు తీసుకోవడం విద్యార్థులకు ఒక విధమైన యోధుల స్ఫూర్తిని పెంపొందించడానికి సహాయపడుతుంది.

శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు...

పాఠశాలల్లో ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడానికి జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన ఏజెన్సీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేయాలని రాష్ట్రంలోని జిల్లా విద్యా అధికారులు, ఎక్స్ అఫిషియో ప్రాజెక్టు కోఆర్డినేటర్లు, సమగ్ర శిక్ష అదనపుప్రాజెక్టు కోఆర్డినేటర్‌లకు సూచించింది. ఈ మేరకు శిక్షకులు తప్పనిసరిగా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ మార్షల్ ఆర్ట్స్‌లో అర్హత మరియు అనుభవం కలిగి ఉండాలి. జిల్లా స్థాయిలో వీరిని కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఎంపిక చేస్తుంది. శిక్షణ పారితోషికం రూ.10వేలు చెల్లిస్తారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎంపీపీయూపీలు, జడ్పీహెచ్ఎస్, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, మున్సిపల్, సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమంలో నైపుణ్యం కలిగిన సమర్థ ఏజెన్సీలను ఆకర్షించడానికి విస్తృత ప్రచారం ఈ సందర్భంగా చేయాల్సి ఉంటుంది.

స్త్రీలనే శిక్షకులుగా నియమించాలి



బాలికలు స్వేచ్ఛగా తిరిగేందుకు ప్రభుత్వం కల్పించిన శిక్షణ పట్ల హర్షనీయం. అయితే బాలికలకు ఇచ్చే ఆత్మరక్షణ శిక్షకులుగా మహిళలను నియమించాలి. ప్రతిరోజు ఉదయం నాలుగవ పీరియడ్‌ను శిక్షణకు కేటాయించాలి. కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రత్యేక దుస్తులను ప్రభుత్వం సరఫరా చేయాలి.

-సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

ఉన్న స్థితి నుంచి ఉన్నతస్థితికి చేరే మార్గం నైపుణ్యం

- ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ వర్లు

కడప ఎడ్యుకేషన్, నవరి 31 (ఆంధ్రజ్యోతి): మనిషి మెదడుకు పది వేల కోట్ల కంప్యూటర్ శక్తి ఉంది.. మీలో నిగూఢంగా ఉన్న శక్తిని తెలుసుకోండి.. విశ్వసించండి.. మీరేం కావాలనుకుంటున్నారో నిర్ణయించుకొని జ్ఞాన దీపాన్ని వెలిగించండి.. మీ జీవితాలతో పాటు సమాజంలోని వారికి వెలుగునివ్వండి అని హైదరాబాద్ వర్లూస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సక్సెస్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ వర్లు అన్నారు. శుక్రవారం వైవీయూ ఏపీజే అబ్దుల్ కలాం ప్రాంగణంలో మానసిక వికాస ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వర్లు మాట్లాడుతూ జ్ఞానాన్ని ఉపయోగించుకున్న వారే గొప్పవారుగా నిలుస్తారన్నారు. సమాజం గుర్తించి అభిమానించి గౌరవించాలంటే మన చేతుల్లోనే ఉందన్నారు. కాలయాపన లేకుండా కార్యోన్ముకులు కావాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలన్నారు. ప్రశ్న లేకపోతే ప్రగతి ఉండదన్నారు. యువతలో ఎక్కువ భాగం తాము ఏమీ కావాలనుకుంటున్నారో తెలియదని.. అందరూ చదువుతున్నారు కదా అని చదువుతారని.. దీని వల్ల నిర్ణీత వయసు వచ్చాక స్థిరపడలేకపోతారన్నారు. చిన్న వయసులో ఒక బలమైన నిర్ణయం తీసుకొని అమలు చేసేందుకు ప్రయత్నించాలన్నారు. విద్య ద్వారానే గొప్పవారవుతామని సత్యానాదెళ్ల, అబ్దుల్ కలాం జీవిత విశేషాలను వివరించారు. మనతో పాటు ఉన్న వారి కంటే మనం రెండు గంటలు అదనంగా ప్రయత్నిస్తే చేస్తున్న పనిలో ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. సెల్‌ఫోన్‌లలో ఫేస్‌బుక్, ఇన్‌స్టా, యూట్యూబ్ వంటివి కాలహరణ చేస్తాయని, ప్రేమలు సినిమాల్లోనే సక్సెస్ అవుతాయని నిజజీవితంలో కాదన్నారు. ఈ ప్రకృతి అందరికి ఒకే మెదడు ఇచ్చిందని దాని శక్తి తెలియక మనం ఉన్నస్థితిలోనే ఉండిపోతున్నామని.. మైండ్ ను వినియోగించుకున్నవారే ఉన్నత స్థితికి చేరుతారన్నారు. ఆత్మవిశ్వాసం పెంపొందించుకునేందుకు సూచనలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు శాశ్వత ప్రయోజనాలు, ఉజ్వల భవిష్యత్తు గురించి ఆలోచించాలన్నారు. ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ పద్మ, దంత వైద్య నిపుణులు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో సహ అచార్యులు డాక్టర్ అనూ ప్రసన్న, జర్నలిజంశాఖ అధ్యాపకులు డాక్టర్ టి.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ వర్లు

ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరు

- ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి

కడప మారుతీనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై రాజీ లేని పోరు సాగిస్తామని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగుల బకాయిలు సుమారు 25వేల కోట్లు ఉంటే కూటమి ప్రభుత్వం కేవలం 13 కోట్లు తూతూ మంత్రంగా విడుదల చేయడం సరి కాదన్నారు. కొండంత బకాయిలు ఉన్నప్పటికీ గోరంత విడుదల చేస్తూ అసత్య ప్రచారం చేసుకోవడం విచాకరమన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల సమ్యస్యల గురించి ప్రతి మూడు నాలుగు నెలలకు ఒకసారి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసేవారన్నారు. ప్రస్తుతం ఆ విధానానికి స్వస్తి పలికి ఉద్యోగుల న్యాయమైన సమస్యలను కూడా పక్కన పెట్టేశారని ఆరోపించారు. టీడీపీ అ ధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా ఇంత వరకు ఉద్యోగుల సమస్యల గురించి ఏ మాత్రం పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులకు రావాలసిన ఐఆర్, పీఆర్సీ ఊసే ఎత్తడం లేదన్నారు. ముఖ్యంగా సచివాలయ వ్యవస్థను హేతుబద్దం చేస్తున్నామనే సాకుతో ఉద్యోగుల సంఖ్యను కుదించి పనిభారం పెంచడం విచారకరమన్నారు. ఇప్పటికైనా సచివాలయ వ్యవస్థను గురించి ఒక కమిటీ వేసి తద్వారా హేతుబద్దీకరణ చేయాలన్నారు. లేనిపక్షంలో ఉద్యోగుల ను ఏకం చేసి పాలక ప్రభుత్వంపై పోరు చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు లెక్కల జమాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాకర్ల వెంకట్రామిరెడ్డి

ఆటో బోల్తా... వ్యక్తి మృతి

దువ్వూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కానగూడూరు సమీపంలోని లింకురోడ్డు వద్ద గురువారం రాత్రి ఆటో బోల్తా పడిన సంఘటనలో వేల్పుల సుబ్బరాయుడు (28) అనే వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించిన వారి బంధువులకు సమాచారం అందించారు. పోలీసులకు విషయం తెలియడంతో సంఘ టనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. తాలుకా సీఐ కళా వెంకటరమణ వివరాల మేరకు.. మదనపల్లె మండలం రెడ్డివారిపల్లె సమీపంలోని గుండావారిపల్లె వద్ద నాలుగు లైన్లు జాతీయ రహదారి బ్రిడ్జి కింద ఐచర్ వాహనం బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కురబలకోట మండలం నడింపల్లెకు చెందిన కార్తీక్(23) అక్కడికక్కడే మృతి చెందగా సీటీఎం రెగంటివారిపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం(40) తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని 108 వాహనంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సమాచారం అందుకున్న సీఐ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

'దళిత ఎంపీడీవోపై కక్ష సాధింపు తగదు'

గాలివీడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దళిత ఎంపీడీవోపై దాడి చేయడమే కాకుండా మండల పరిషత్ సమావేశంలో నిందలు వేయడం సమంజసం కాదని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మందపాటి రవీంద్ర బాబు, సర్పంచ్ పార్థసారథిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరాజులు విమర్శించారు. శుక్రవారం గాలివీడులో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ ఎంపీటీసీ సభ్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత డిసెం బర్ 27న విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవోపై వైసీపీ నాయకులు దాడి చేశా రన్నారు. దీంతో పలువురు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు, నాయకులపై కేసులు నమోదైన విషయం తెలిసిందేనన్నారు. ప్రస్తుతం ఉన్న ఎంపీ టీసీ సభ్యులను ప్రజలు ఎన్నుకోలేదని, అప్పట్లో టీడీపీ నాయకులపై కేసులు, బిల్లుల చెల్లింపులపై బెదిరింపులతో అప్రజాస్వామికంగా ఎంపిక అయ్యారని తెలిపారు. నిజంగా వారికి నైతిక విలువలు ఉంటే వెంటనే తమ పదవులకు రాజీనామా చేసి తిరిగి పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. ఎంపీడీవోపై దాడి చేసిన వారికి సాక్షాత్తూ మండల పరిషత్ అధ్యక్షురాలు వత్తాసు పలకడం, మండల సమావేశంలో నిందితులు కోర్టు పరిధిలోని అంశాలు చర్చించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

చిన్నారుల నిజాయితీ ఉపాధ్యాయుడికి నగదు అప్పగింత



చిన్నారులను అభినందిస్తున్న ఎంఈవో త్యాగరాజు

తంబళ్లపల్లె, జనవరి 31(ఆంధ్రజ్యోతి): చిన్నారి విద్యార్థులు నిజాయితీ చాటుకున్నారు. రోడ్డుపై దొరకిన రూ.700లను పోగొట్టుకున్న ఉపాధ్యాయుడికి అప్పగించి అందరిచే శభాష్ అనిపించుకున్నారు. వివరాల మేరకు...తంబళ్లపల్లె మండలం ఎగువ బోయపల్లె పాఠశాల ఉపాధ్యాయుడు ఎసానుల్లా శుక్రవారం ఉదయం తంబళ్లపల్లెలో బస్సు దిగి పాఠశాల విధులకు వెళ్తున్న క్రమంలో ఆయన జేబులో ఉన్న రూ.700లు రోడ్డుపై పడిపోయాయి. ఈ విషయం గమనించని టీచర్ ముందుకు వెళ్లిపోయాడు. ఇదే సమయంలో తంబళ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి చదువుకున్న శశి, 5వ తరగతి చదువుతున్న కళ్యాణి అక్కాచెల్లెళ్లు పాఠశాలకు వెళ్తుండగా డబ్బు పడిపోయిన విషయం గమనించారు. వెంటనే పరిగెత్తుకుంటూ వెళ్లి ఆ డబ్బును టీచర్‌కు అందచేశారు. అయితే, డబ్బు పోగొట్టుకున్న వ్యక్తి టీచర్ అనే విషయం విద్యార్థులకు తెలియదు. దీంతో ఆ టీచర్ విద్యార్థుల నిజాయితీని మెచ్చుకుని విషయాన్ని ఎంఈవో త్యాగరాజుకు తెలియచేశారు. ఎంఈవో, హెచ్ఎం రెడ్డప్పరెడ్డి విద్యార్థుల నిజాయితీని మెచ్చుకుని వారికి చిరు కానుకలను ఇచ్చి అభినందించారు.

కూలీల సంఖ్య పెంచకపోతే కఠిన చర్యలు

పెద్దతిప్పసముద్రం జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో భాగంగా ఆయా గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచి పనులు కల్పించకపోతే కఠిన చర్యలు తప్పవని ఉపాధి సిబ్బందిని ఏపీడీ మధుబాబు హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ప్రస్తుతం పని చేస్తున్న కూలీలు, జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఉపాధి సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పనుల వలన కలిగే ప్రయోజనాలను, ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న కూలీ రేట్లను వారికి వివరించి ఉపాధి కూలీలను పనులకు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు.మండలంలోని ఆయా గ్రామాల్లో వచ్చే రెండు మూడు మాసాల్లో ప్రభుత్వం నిర్దేశించిన పని దినాలను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఏపీవో తిరుపాలప్ప, జేఈ మహేష్‌బాబు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

పెద్దతిప్పసముద్రం జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మదనపల్లె లయన్స్ క్లబ్ కంటి వైద్య ఆసుపత్రివారి అద్వర్యంలో రంగసముద్రంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక మాజీ సర్పంచ్ సవరాల రవి శంకర్ లయన్స్ క్లబ్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో గ్రామంలోని వివిధ పల్లెల నుంచి సుమారు. 49 మంది కంటి వైద్యశిబిరానికి హాజరు కాగా వారిలో 29 మందికి ఆపరేషన్ అవసరమని కంటి వైద్య నిపుణులు నిర్దారించారు. వారికి వివిధ పరీక్షలు నిర్వహించిన అనంతరం వారిని మదనపల్లెలోని లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రికి ఉచిత వాహనం ద్వారా తరలించి ఎన్‌టీఆర్ వైద్యసేవా పథకం కింద ఉచితంగా ఆపరేషన్ చేసి వారికి మందులను అందచేస్తామన్నారు.

పాఠశాలలకు ప్రహరీ గోడలు నిర్మించండి

పెద్దమండ్యం, జనవరి 31(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలం పాపేపల్లి గ్రామ పంచాయతీ గురివిరెడ్డిగారిపల్లి, గుడిసెవారిపల్లి పి. తురకపల్లి ఉర్దూ ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాలని ఆ గ్రామ విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవో మనోహర్‌ను కోరారు. శుక్రవారం గురివిరెడ్డిగారిపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఎంఈవో తనిఖీ చేశారు. గతంలో నాడు-నేడు ఈ పాఠశాలలో పనులు చేపట్టారు. ప్రస్తుతం ప్రహరీలు లేకపోవడంతో పాఠశాల ఆవరణంలోకి పశువులు సంచరిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ఎస్ఐ, సీఐ ఇళ్లలో ఏసీబీ అధికారుల తనిఖీలు

మదనపల్లె అర్బన్ జనవరి 31(ఆంధ్రజ్యోతి):లారీ ఓనర్ వద్ద రూ. 70 వేలు లంచం తీసుకొంటూ ఏసీబీ అధికారులకు ఎస్ఐ పట్టుబడ్డ విషయం తెలిసిందే. దీంతో మదనపల్లెలోని టీచర్ కాలనీలోని రామసముద్రం ఎస్ఐ వెంకట సుబ్బయ్య, మదనపల్లె రూరల్ సీఐగా పని చేస్తున్న రమేష్ ఇళ్లను ఏసీబీ అధికారులు తనిఖీ నిర్వహించారు. ఇళ్లలోని రికార్డులను, తదితరాలను స్వాధీనం చేసుకున్నారు.

ములకలచెరువులో పిచ్చికుక్క వీరంగం

- పలువురు చిన్నారులకు తీవ్ర గాయాలు

ములకలచెరువు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ములకల చెరువులో శుక్రవారం పిచ్చికుక్క వీరంగం సృష్టించింది. ఇళ్ల ముందు ఆడుకుంటున్న పలువురు చిన్నారులపై దాడి చేసి కరిచింది. దీంతో చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక నల్లగుట్టలో పూనర్విక(5), మౌళాలి (6) తది తరులుపై దాడి చేసింది. అలాగే చౌడసముద్రంకు చెందిన రమణమ్మ(45), అలీ(8), వెంకటేష్(60)లపై కూడా పిచ్చి కుక్క దాడి చేసి కరిచింది. వారందరూ స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలు చేయించుకున్నారు. పది రోజు ల రోజుల క్రితం కూడా ఓ పిచ్చికుక్క నాలుగు గ్రామా లపై దాడి చేసి సుమారు 50 మందిని కరిచిన విషయం విదితయే. తాజాగా మరో పిచ్చికుక్క దాడి చేసింది.

సారా విక్రేత అరెస్టు

నిమ్మనపల్లి జనవరి 31(ఆంధ్రజ్యోతి):గుట్టుచప్పడు కాకుండా నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకొని అతని వద్ద నుంచి 20లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ముష్టూరు పంచాయతి యర్రప్పగారిపల్లికి చెందిన రవి(37) గ్రామ సమాపంలో నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులతో కలిసి దాడులు నిర్వహించి అతని వద్ద నుంచి 20లీటర్లు సాటుసారా స్వాధీనం చేసుకొని రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

ట్రిపుల్‌ఐటీలో క్యాంటీన్లు ఏర్పాటు

వేంపల్లె, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు నాలుగు నెలల తర్వాత ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో క్యాంటీన్లు అందుబాటులోకి వచ్చాయి. గతంలో ఉన్న క్యాంటీన్లను మూసేశారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ద్వారా అధికారులు డ్వాక్రా గ్రూపులకు కేటాయించారు. తమకే కావాలని టీడీపీలో ఉన్న ప్రధాన నాయకులు పట్టుబట్టడం, నిబంధనల ప్రకారం కేటాయించాలని, లేకుంటే తమ వారికి ఒకటి ఇవ్వాలని వైసీపీ ముఖ్యనేత పట్టుబట్టడంతో ట్రిపుల్ ఐటీ అధికారులకు తలనొప్పిగా మారింది. దీంతో క్యాంటీన్ల వ్యవహారాన్ని కలెక్టర్‌కు పంపారు. దీంతో నాలుగు నెలలు జాప్యం కాగా ట్రిపుల్‌ఐటీలో ఉన్న వేలాది మంది విద్యార్థులు బయటి ఫుడ్ కోసం ఎగబడ్డారు. క్యాంటీన్లు లేక ఇబ్బంది పడ్డారు. శుక్రవారం బాలుర హాస్టల్‌లో ఒక క్యాంటీన్, బాలికల హాస్టల్‌లో మరో క్యాంటీన్‌ను ప్రారంభించారు. దీనితో క్యాంటీన్లు రద్దీగా కనిపించాయి.

క్రమశిక్షణతో విధులు నిర్వహించండి : అదనపు ఎస్పీ

కడప క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ జిల్లా పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని అదనపు ఎస్పీ కె.ప్రకాశ్‌బాబు పిలుపునిచ్చారు. జిల్లా సాయుధ పోలీసు బలగాలకు రెండు వారాల పాటు నిర్వహించిన మొబిలైజేషన్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. స్థానిక పోలీసుపరేడ్ మైదానంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఏఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పరిశీలన వాహనంపై వెళ్లి ఏఆర్ ప్లటూనను పరిశీలించి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్రంలోనే జిల్లా పోలీసులకు మంచి పేరుందన్నారు. ఏఆర్ సిబ్బందికి ప్రతి ఏటా మొబిలైజేషన్ కార్యక్రమం నిర్వహించి విధుల్లో నైపుణ్యం, ఫిజికల్ ఫిట్‌నెస్‌ను మెరుగుపరచడం ఆనవాయితీగా వస్తోందన్నారు. డీ మొబిలైజేషన్ పరేడ్‌ను క్రమశిక్షణతో అద్భుతంగా చేశారని పరేడ్ కమాండర్ వీరేశ్‌ను భినందించారు. అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. మొబిలైజేషన్‌లో ఫైరింగ్, టర్న్ అవుట్ అండ్ ప్రొఫిషియెన్సీ పే టెస్ట్, డ్రైవింగ్‌లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు ఆనంద్, వీరేశ్, శివరాముడు, టైటస్, శ్రీశైలరెడ్డి, ఆర్ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ

ఘనంగా పారువేట

లక్కిరెడ్డిపల్లె జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురం గ్రామంలో గంగమ్మ జాతర సందర్భంగా శుక్రవారం పారువేట నిర్వహించారు. ప్రతి ఏటా లాగే పుష్యమాసంలో వచ్చే చొల్లంగి అమవాస్య తరువాత పాడ్యమినాడు యాదవ సామాజిక వర్గానికి చెందిన పూజారులు గొల్లపల్లెలోని అమ్మవారి ఇంటి నుంచి వేయి కనులచీర, జాకెట్, వెండికళ్లు, కోరలు, అమ్మవారి చిత్రకన్నును చెల్లు వంశీయులు బ్యాండ్ వాయిద్యాల మధ్య తీసుకువచ్చి గంగమ్మ దేవాలయంలో అప్పగించారు. శుక్రవారం తెల్లవారు జామున ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం గొర్రెను బలి ఇచ్చి పూజలు నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ రవీంద్రబాబు బందో బస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అమ్మవారి పూజారులు గంగరాజుయాదవ్, దినేష్‌యాదవ్ పాల్గొన్నారు.





అమ్మవారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు, ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



చెల్లు వంశీయుల ఇంటి నుంచి అమ్మవారికి వేయి కనుల చీర తీసుకెలుతున్న దృశ్యం

మిట్స్‌కు ఐఐసీ ర్యాంకింగ్

కురబలకోట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు ఐఐసీ 5స్టార్ ర్యాంకింగ్ దక్కినట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కళాశాలలో పరిశోధన, స్టార్టప్, సాంకేతిక పురోభివృద్ధి తదితర వాటిని పరిగణలోకి తీసుకుని ఈ ర్యాంకింగ్‌ను ప్రకటించారు. కాగా ర్యాంకింగ్ రావడంతో కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ, ప్రిన్సిపల్ యువరాజ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ

పెద్దతిప్పసముద్రం జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఆయా కేంద్రాల్లో కేటాయించిన సచివాలయ సిబ్బందిచే ఉదయం నుంచే పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్ పేర్కొన్నారు. నిర్దేశిత ప్రాంతాల్లో పెన్షన్‌దారులు సచివాల సిబ్బందికి సహకరించి పెన్షన్లను తీసుకోవాలని ఎంపీడీవో కోరారు.

వాసవీమాతకు పట్టువస్త్రాలు సమర్పణ



పీలేరులో బంగారు చీర అలంకరణలో అమ్మవారు



వాల్మీకిపురంలో అమ్మవారికి పట్టువస్త్రాలు తెస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

పీలేరు/వాల్మీకిపురం/మదనపల్లె అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీలేరులోని అమ్మవారికి స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి పట్టువస్త్రాలు సమరించారు. ఈ సందర్భంగా పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ కోరిక అయిన అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు సీఎం చంద్రబాబునాయుడు అంగీకరించడం ఎంతో సంతోషకరమన్నారు. ఆయన పెనుగొండలోనూ, స్థానిక ఎమ్మెల్యే పీలేరులోనూ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిచడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అమ్మ వారి మూలవిరాట్‌కు బంగారు చీరను అలంకరించారు. ఆర్యవైశ్య సంఘం మహిళలు ప్రత్యేక భజనలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు బలసా వేణుగోపాల్, కూనా సత్యం, ఎర్రయ్య శెట్టి, రేవూరి సుధీర్, జూటూరు అరవింద్, శ్రీపురం వెంకటేశ్, విజయమహేశ్, పామిడి మహేశ్, సీఆర్ రాజేశ్ పాల్గొన్నారు. వాల్మీకిపురం పట్టణంలోని బజారు వీధిలో వెలసిన కన్యకాపర మేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మండలంలోని చింతపర్తిలో కూడా అమ్మవారి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. ఈకార్యక్రమాలలో మాజీ మార్కెట్ ఛైర్మన్ కంభం నిరంజన్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, రాజేంద్రాచారి, చంద్రమౌళి, పీవీ నారాయణ, ఆర్యవైశ్య సంఘాల అధ్యక్షులు తబ్బుల సతీష్, కాంతరాజు, రామ్మోహన్, పాల్గొన్నారు. మదనపల్లె పట్టణం లో కన్యకా పరమేశ్వరీదేవి ఆత్మార్పణ దినోత్సవాన్ని మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్ ఆధ్వర్యంలో శుక్ర వారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దేవ ళంవీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం నుంచి కన్యకలు, దంపతులు పాల్గొని గంగను తెచ్చి కన్యాకా పరమేశ్వరీ అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం కలశ పూజ, విశేషాలంకరణచేసి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిం చారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మదనపల్లె ఆర్యవైశ్యసంఘం కార్యదర్శి సురేగిరధర్, ఉపాధ్యక్షుడు దేవతా సతీష్, తదితరులు పర్యవేక్షించారు.



మదనపల్లెలో వెంకటరమణస్వామి ఆలయం నుంచి గంగను తెస్తున్న దృశ్యం

డీఎంగా బండ్ల కుమార్ సేవలు ఆదర్శం



బండ్ల కుమార్ దంపతులను సన్మానిస్తున్న ఆర్ఎం రాము

పీలేరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పీలేరు ఆర్టీసీ డీఎంగా బండ్ల కుమార్ చేసిన సేవలు ఆదర్శనీయమని ఆర్ఎం రాము తెలిపారు. పీలేరులో శుక్ర వారం బండ్ల కుమార్ పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం బండ్ల కుమార్ దంపతులను ఆయన ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో మదనపల్లె-2 డిపో డీఎం అమరనాథ్, రాజంపేట డీఎం రమణయ్య, ఆత్మకూరు డీఎం వీరాస్వామి, గ్యారేజ్ ఎంఎఫ్ హరినాథరెడ్డి, సీఐ సుబ్బమ్మ, యూనియన్ నాయకులు పీఎస్ఎం రాజు, సీవీ రమణ, ఖాదర్‌బాషా, రమణ, షరీఫ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది



ఉపాధ్యాయుడు శ్రీరాములు ను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

పెద్దమండ్యం, జనవరి 31(ఆంధ్రజ్యోతి) ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని అనంతపురం జిల్లా బత్తలపల్లి సీఐ నీళ్ల ప్రభాకర పేర్కొన్నారు. పెద్దమండ్యం జిల్లా ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీరాములు శుక్రవారం పదవీ విరమణ కార్యక్రమంలో తోటి ఉపాధ్యాయులు ఆయనను దుశ్శాలవతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పదన్నారు. కార్యక్రమంలో పెద్దమండ్యం, ములకలచెరువు ఎంఈవోలు మనోహర, రామకృష్ణ, వెంకటరమణ, రాష్ట్ర సీనియర్ బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, సర్పంచులు బాష, విశ్వనాథ, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

108 సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

కలికిరి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రధాన ఎమర్జెన్సీ సర్వీసులైన 108 వాహన సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని జిల్లా సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ నాయకుడు రామాంజులు మాట్లాడుతూ జిల్లాలోని ప్రధాన కేంద్రాల ఆసుపత్రుల నుంచి రెఫరల్ కేసులు, రిలీవింగ్ బిల్లులు, అంబులెన్స్ మరమ్మతుల బిల్లులు, తక్షణం చెల్లించాలని కోరారు. 108 అంబులెన్స్ సిబ్బంది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బల్లి కిరణ్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని, సిబ్బంది సమస్యలపై గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సమావేశంలో రాజంపేట, కోడూరు, రాయచోటి, మదనపల్లె, తంబళ్ళపల్లె, పీలేరు కేంద్రాలకు చెందిన సిబ్బందితోపాటు రాష్ట్ర సంఘం నాయకులు శ్రీనివాసులు, మహేశ్, నరసింహా రావు, ఎస్వీ రమణ, బీబీ చలపతి, జశ్వంత్, దామోదరం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గద్దర్ 77వ జయంతి

మదనపల్లె/పీలేరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్ధ నౌక గద్దర్ 77వ జయంతిని శుక్రవారం దళిత సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. పీలేరు భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) కార్యాలయంలో గద్దర్ చిత్రపటాన్ని ఆవిష్కరించి పూలమాలలు అర్పించి ఆయనకు నివాళులు అర్పించారు. డీపీఎంసీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు 'బాస్' నాయకులు ఎర్రబెల్లి మల్లిఖార్జున, పల్లెపోగు హరినాథ, ముల్లంగి గురయవ్య, రామకృష్ణ, బాలు, మాలమహానాడు నాయకులు తుమ్మల ధరణీ కుమార్, జెట్టి మల్లిఖార్జున, విజయ్, జెట్టి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు. మదనపల్లె అంబేడ్కర్ సర్కిల్ వద్ద గద్దర్ స్మృతి, స్థూపం, గద్దర్ చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పీటీఎం శివప్రసాద్ మాట్లాడు తూ గద్దర్ ఒక వ్యక్తి కాదన్నారు. ముత్యాల మోహన్, జిల్లా ప్రధాన కార్యాదర్శి పెద్దపాళెం రవిశంకర్, నీరుగట్టి వెంకట రమణ, చాట్ల బయన్న, వై.చిన్నా, వై.గంగాధర్, మీసాల గంగులు, క్రాంతి, నరసింహా, ఇర్ఫాన్, రాజేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

గుర్రంకొండ, జనవరి 31(ఆంధ్రజ్యోతి):ప్రకృతి వ్యవసాయ పద్ధతితో సాగు చేసిన ఆకుకూరలు, పండ్లను తినడంతో మంచి ఆరోగ్యం లభిస్తుందని ఈవోఆర్డీ బ్రహ్మానందరెడ్డి అన్నారు. గుర్రంకొండ ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన ఆకు కూరలు, పండ్లు, చిరుధాన్యాల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు రసాయన ఎరువులు వినియోగించి పండించిన పంటలను తినడం ద్వారా ప్రస్తుతం అనేక రకాల జబ్బులు వస్తునట్లు తెలిపారు. వ్యవసాయంలో రైతులు సేంద్రియ ఎరువులను వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏవో నాగశివారెడ్డి, ఎంటీటీ వెంకటజ్యోతి, రమేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ధనలక్ష్మి, గిరీష్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

నిమ్మనపల్లి జనవరి 31(ఆంధ్రజ్యోతి): బీసీ, ఈ-బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని బీసీ, ఈ బీసీ కేటగిరీలకు చెందిన లబ్ధిదారులు ఈబీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు పొందేదుకు అవకాశం కల్పించిందని తెలిపారు. రుణాలు పొందేందుకు ఫిబ్రవరి 7వతేదీ వరకు అవకాశం ఉందని లబ్ధిదారులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

చెన్నకేశవ ఆలయ భూములకు పరిహారం మంజూరు

పీలేరు, జనవరి 31: గత పదేళ్లుగా పెండిం గ్‌లో ఉన్న పీలేరు చెన్నకేశవ స్వామి ఆలయ భూములకు ప్రభుత్వం పరిహారం విడుదల చేసిందని పీలేరులోని ఆలయాల ఇన్‌ఛార్జ్ ఈవో రవీంద్ర రాజు తెలిపారు. పీలేరులోని చెన్నకేశవ స్వామి, రౌద్రాల అంకాళమ్మ ఆలయాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు-మదనపల్లె మార్గంలోని ఈద్గాహ్ మైదానం పక్కనున్న చెన్నకేశవ స్వామి ఆలయ భూములను ప్రభుత్వం కోర్టు భవంతుల కోసం తీసుకుందన్నారు. ఆ భూములకు రూ.2.93 కోట్ల పరిహారం నిర్ణయించి గతంలో రూ.1.64 కోట్లు మంజూరు చేసిందన్నారు. మిగిలిన పరిహారం వివిధ కారణాల వల్ల 2013 నుంచి పెండింగ్‌లో ఉండేదని, తాము జరిపిన కృషి కారణంగా కూటమి ప్రభుత్వం నవంబరు 27, 2024న జీవో ఆర్‌టీ నెం.2318 ద్వారా రూ.1.29 కోట్లను పరిహారం చెల్లింపు కోసం మంజూరు చేసిందన్నారు. త్వరలోనే ఆ నిధులు ఆలయ బ్యాంకు ఖాతాలో జమ అవుతాయన్నారు. రౌద్రాల అంకాళమ్మ ఆలయానికి మొత్తం 2.98 ఎకరాల భూమి ఉండేదని, ప్రభుత్వ ఆసుపత్రి, ఆక్రమణల తరువాత కేవలం 13 సెంట్లు మాత్రమే మిగిలాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పరిహారం రాబట్టేందుకు కృషి చేస్తున్నామని, ఇతరుల నుంచి భూమిని స్వాధీనం చేసుకునేందుకు చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తున్నామన్నారు.

ఎల్లవేళలా కార్యకర్తలకు అండగా ఉంటా..: ఎమ్మెల్యే

వాల్మీకిపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఏ కష్టమొచ్చినా కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. వాల్మీకిపురం కు చెందిన టీడీపీ సీనియర్ మైనార్టీ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ టమోటా మహమూద్ ఇటీవల కొద్దిరోజుల క్రితం మృతి చెందారు. శుక్రవారం ఎమ్మెల్యే మహమూద్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, తెలుగు యువత చాను, మండల పార్టీ ఉపాధ్యక్షుడు బొక్కసం రామకృష్ణ, నాయకులు పీవీ నారాయణ, శేషాద్రిరెడ్డి, సయ్యద్, మెకానిక్ చాను, ఆరీఫ్, జాఫర్, సాదిక్, సురేంద్రవర్మ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

పీలేరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం వేపులబైలు పంచాయతీ రెడ్డివారిపల్లె వద్ద నూతనంగా నిర్మితమైన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతా లకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అందులో భా గంగా పీలేరు నియోజకవర్గంలోనూ కొత్త సబ్ స్టేషన్‌లు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఈఈ చంద్రశేఖరరెడ్డి, డీఈ శివయ్య, ఏఈలు రామ్మూర్తి, ఖాదర్ ఇలాహీ, యూడీసీ మహమ్మద్ రఫీ, టీడీపీ నాయకులు కోటపల్లె బాబు, శ్రీకాంత్ రెడ్డి, పురం రామ్మూర్తి, నారే సతీశ్, శ్రీనాథరెడ్డి, వసంతాల రాజా, గాయం వెంకటరెడ్డి, వరం పాటి రెడ్డప్ప రెడ్డి, శంకర, నారాయణ రెడ్డి, జయచంద్ర, నందీశ్వర, అంకయ్య, మనోహర, పఠాన్ మౌలా, తదితరులు పాల్గొన్నారు.

అంగళ్లులో రూ.12 లక్షలు చోరీ.. పోలీసుల విచారణ

కురబలకోట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లులో రూ.12 లక్షలు చోరీ జరిగిందని బాధితుడు ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఈ ఘటనపై సమగ్రంగా విచారిస్తున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. అంగళ్ళుకు చెందిన ఫజురుల్లా ఏటీఎంలలో క్యాస్ లోడింగ్ ప్రాంఛైజీ తీసుకున్నాడు. కాగా శుక్రవారం బ్యాంకు నుంచి డబ్బులు తీసుకుని ఇంటికి వచ్చి ఒక రూములో ఉంచి మరొక రూములోకి భోజనం చేయడానికి వెళ్లానని ఆసమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి వెళ్లి ఆ సొమ్ముతో పాటుగా మరో రెండు సెల్‌ఫోన్‌లను దొంగలించుకు వెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని విచారిస్తున్నట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

మళ్లీ మండల సమావేశం వాయిదా

కలకడ, జనవరి 31(ఆంధ్రజ్యోతి):మండల స మావేశానికి తగిన సంఖ్యలో ఎంపీటీసీ సభ్యులు హాజరుకాకపోవడంతో శుక్రవారం మండల సమావేశం మూడో సారి వాయిదా పడింది. ఉదయం 10.30 గంటలకు సమావేశం జరగా ల్సిఉండగా నిర్ణీత సమయం గంట దాటిన ఎం పీపీ శ్రీదేవితోపాటు ఎనుగొండపాలెం, కలకడ ఎంపీటీసీలు ఈశ్వర్‌నాయుడు, ముబారక్‌లు మాత్రమే హాజరయ్యారు.మొత్తం 11 మందికి గానూ కనీసం నలుగురు సభ్యులు రావాల్సి ఉంది. కానీ ముగ్గురు మాత్రమే హాజరుకావడంతో కోరంలేక వాయిదా వేస్తునట్లు ఎంపీపీ శ్రీదేవి తెలిపారు. గతఏడాది అక్టోబరు 16, ఈ ఏడాది జనవరి 10న వాయిదాపడింది. కాగా సమావేశం వాయిదా పడిన విషయాన్ని జిల్లా సీఈవో దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీడీవో అబ్దుల్ రహీం తెలిపారు.

గీత కులాల మద్యం దుకాణాలకు నోటిఫికేషన్

పీలేరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గీత కులాల కు పీలేరు నియోజకవర్గంలో కేటాయించిన మ ద్యం దుకాణాలకు నోటిఫికేషన్ వెలువడినట్లు పీలేరు ఎక్సైజ్ సీఐ నీవీ సుబ్బారెడ్డి తెలిపారు. పీలేరులో ఒక దుకాణం గాండ్ల కులానికి, కల కడలో ఒక దుకాణం ఈడిగ కులానికి ప్రభు త్వం నోటిఫై చేసిందన్నారు. దుకాణాల కోసం ఆయా కులాల వారు రూ.2 లక్షల నాన్ రీఫం డబుల్ అప్లికేషన్ ఫీజు చెల్లించి ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

హంద్రీ-నీవా కాలువ సామర్థ్యాన్ని పెంచాలి : సీపీఐ

మదనపల్లె అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి):హంద్రీ-కాలువ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కుల నీటికి పెంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మీడియా సమావేశంలో నరసింహులు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల అభివృద్ధికి కీలక ప్రాజెక్టుగా ఉన్న హంద్రీ-నీవా సృజల స్రవంతి ప్రాజెక్టును త్వరిగతిన పూర్తి చేయాలన్నారు. మదనపల్లె ప్రజల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ పనులు పూర్తి చేయాలని, దీనిపై ఫిబ్రవరి 3న సీపీఐ ఆధ్వర్యంలో మదనపల్లెలో ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణప్ప, మదనపల్లె నియోజ.కవర్గ కార్యదర్శి మురళి, మాధవ్, రెడ్డి, తిరుమల, గజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.









